# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ 04.14.2025 | 24 క్యారెట్లు 93,380.00 | కిలో వెండి 1,12,000.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:163

www.vishalabharati.com





- 5 గంటల్లోనే 9 సెంటీమీటర్ల కుండపోత
- చెరువులను తలపించిన రోడ్లు
- ఇళ్లలోకి వరద నీరు.. కొట్టుకుపోయిన బండ్లు
- ఊడిపడ్డ చార్మినార్ పెచ్చులు..
- భయంతో పరుగులు పెట్టిన పర్యాటకులు
- జిల్లాల్లో పలుచోట్ల పంటలకు తీవ్ర నష్టం
- మరో మూడు రోజులు వానలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో పలుచోట్ల అకాల వర్షం బీభత్సం సృష్టించింది. గురువారం హైదరాబాద్ అంతటా భారీ వర్షం కురిసింది. చాలా ప్రాంతాల్లో రోడ్లు నీట మునిగాయి. ఉరుములు, మెరుపులతో వాన దంచికొట్టింది. దీనితో నగరంలోని రోడ్లన్నీ చెరువుల్లా మారాయి. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. పాతబస్తీలో గంటపాటు భారీ వర్షం కురిసింది. ఈ ప్రాంతంలో ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. అయితే ఈ వర్షాల వల్ల చార్మినార్‌కు కూడా నష్టం వాటిల్లింది. పెచ్చులు ఊడిపోయి భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం ముందు పడ్డాయి. గతంలో రిపేర్ చేసిన మీనార్ నుంచే పెచ్చులు ఊడిపడ్డాయి. పెచ్చులు పడినప్పుడు అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కానీ చార్మినార్

..మిగతా 2 లో

# అంత తొందరెందుకు..?

- 400 ఎకరాల్లో తక్షణం పనులు ఆపండి
- వందల కొద్దీ యంత్రాలను ఎందుకు తెచ్చారు..?
- చెట్ల తొలగింపునకు అనుమతి తీసుకున్నారా..?
- అక్కడ జంతు, వృక్ష జాతులున్నట్లు తెలుస్తోంది కదా
- వందల ఎకరాల్లో చెట్లు తొలగించడం చిన్న విషయం కాదు
- చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారు..?
- ఎంతటి వారైనా చట్టానికి అతీతులు కాదు
- నిబంధనల ఉల్లంఘనకు సీఎస్‌దే బాధ్యత
- తేడా వస్తే సీఎస్‌ను జైలుకు పంపిస్తాం
- కంచె గచ్చిబౌలి భూములపై రాష్ట్ర సర్కారుకు సుప్రీంకోర్టు ఆదేశం
- 16వ తేదీకి విచారణ వాయిదా



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హెచ్‌సీయూ పక్కనున్న 400 ఎకరాల కంచ గచ్చిబౌలిలోని భూముల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వ తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు కంచ గచ్చిబౌలి భూముల్లో తక్షణమే పనులు నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరిగింది. 400 ఎకరాల భూముల ప్రస్తుతస్థితిపై తమకు తక్షణమే నివేదిక ఇవ్వాలని తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్‌ను సుప్రీంకోర్టు గురువారం ఉదయం ఆదేశించింది. దీంతో స్వయంగా భూముల వద్దకు వెళ్లి పరిశీలించిన హైకోర్టు రిజిస్ట్రార్ మధ్యాహ్నానికల్లా మధ్యంతర నివేదికను పంపారు. హైకోర్టు నివేదికను పరిశీలించిన జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని పేర్కొంది. ఈ వ్యవహారానికి సంబంధించి వార్తా కథనాలను న్యాయవాదులు జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు మెన్షన్ చేశారు. ఈ సందర్భంగా మీడియాలో వచ్చిన కథనాలను పరమేశ్వర్ ధర్మాసనం

..మిగతా 2 లో

# వక్ఫ్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం

- రాజ్యసభలోనూ గట్టెక్కిన 'ఉమీద్'
- అనుకూలంగా 128, వ్యతిరేకంగా 95 ఓట్లు
- ముస్లింల హక్కుల పరిరక్షణకే బిల్లు
- ఇందులో ముస్లిమేతరుల ప్రమేయం లేదు
- 284 సంస్థలు అభిప్రాయాలు తెలిపాయి
- వక్ఫ్ బిల్లుపై చర్చలో రాజ్యసభలో కేంద్ర మంత్రి రిజిజు

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

రెండు రోజుల పాటు జరిగిన సుదీర్ఘ చర్చ, తీవ్రస్థాయి వాదోపవాదాల అనంతరం వక్ఫ్ (సవరణ) బిల్లు-2025పై పార్లమెంటు ఆమోదముద్ర పడింది. విపక్షాల తీవ్ర అభ్యంతరాల మధ్యే లోక్‌సభ బుధవారం ఈ బిల్లును ఆమోదించడం తెలిసిందే. అది గురువారం రాజ్యసభ ఆమోదం కూడా పొందింది. 13 గంటలకు పైగా జరిగిన చర్చ అనంతరం అర్ధరాత్రి ఒంటి గంట దాటాక ఓటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా జరిగింది. దాదాపుగా ప్రతి సవరణపైనా ఓటింగ్‌కు



..మిగతా 3 లో




# పేదలకు సేవలందించాలి

- దేశంలో ఎవ్వరికీ లేని గుర్తింపు వైద్య వృత్తికే
- అత్యవసర సమయంలో ప్రజలు తలచుకునేది డాక్టర్లనే
- విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- ఘనంగా నల్లగొండ మెడికల్ కాలేజీ స్నాతకోత్సవం
- ఎంబీబీఎస్‌పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేసిన మంత్రి

**విశాలభారతి, నల్లగొండ**

దేశంలో ఏ రంగంలో రాని గుర్తింపు కేవలం ఒక వైద్యవృత్తిలో మాత్రమే లభిస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని ఎస్ఎల్‌బీసీ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ఆవరణలో గురువారం రాత్రి నిర్వహించిన 2019-25 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డేలో ఆయన ఎంబీబీఎస్ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్లగొండ మెడికల్ కాలేజిలో ఎంబీబీఎస్


..మిగతా 2 లో

# ప్రజల ఎదుట న్యాయమూర్తుల ఆస్తుల వివరాలు

- ప్రజల ఎదుట న్యాయమూర్తుల ఆస్తుల వివరాలు
- సుప్రీంకోర్టు జడ్జిల కీలక నిర్ణయం
- న్యాయస్థానం వెబ్‌సైట్‌లో త్వరలో వెల్లడి

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులంతా తమ ఆస్తులను సుప్రీంకోర్టు



..మిగతా 2 లో

# కేబినెట్ విస్తరణకు మళ్లీ బ్రేక్

- గ్రీన్ సిగ్నల్ ఇవ్వని అధిష్టానం
- జాబితాపై ఎటూ తేల్చుకోలేక సతమతం
- ఢిల్లీకి ఆశావహుల చక్కర్లు
- తమకూ అవకాశమివ్వాలంటున్న లంబాడా, మాదిగ ఎమ్మెల్యేలు
- విస్తరణలో ఇబ్బందులున్నాయన్న పీసీసీ చీఫ్
- త్వరలోనే ఏఐసీసీ తేదీ ప్రకటిస్తుందని వెల్లడి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

అదిగో పులి అంటే.... ఇదిగో తోక అన్నట్టు తయారైంది తెలంగాణ కేబినెట్ విస్తరణ వ్యవహారం. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పిసిసి చీఫ్ మహేష్ గౌడ్, మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి అలా ఢిల్లీ ఫ్లైట్ ఎక్కగానే... ఇలా కేబినెట్ విస్తరణ చర్చలు మొదలవుతాయి రాష్ట్రంలో. వాళ్ళు తిరిగి వచ్చేదాకా ఇంటా బయటా అవే మాటలు. ఇటీవల అయితే... ఓ అడుగు ముందుకేసి విస్తరణ ముహూర్తం కూడా పెట్టేశారు కొందరు. ఏప్రిల్ 3 లేదా 4న విస్తరణ ఉంటుందని, ఐదుగురు కొత్త మంత్రులు కేబినెట్‌లోకి రాబోతున్నారని, ఎవరికి తోచిన విశ్లేషణలు వారు చేసేశారు. విస్తరణపై పార్టీ అగ్రనేతలతో చర్చించామని ప్రకటించారు పీసీసీ అధ్యక్షుడు. కానీ... అదే పీసీసీ చీఫ్... అనేక సమస్యలు ఉన్నాయంటూ ఆయన నోటితోనే చెప్పారు. ఢిల్లీ వెళ్ళిన తెలంగాణ కాంగ్రెస్ నేతలు.. అధిష్ఠానానికి వివరాలు ఇచ్చారు. పెద్దోళ్ళు కూడా ఇక మీరు వెళ్ళండి మేం ఫైనల్ లిస్ట్ పంపుతామని చెప్పేశారట. అందుకే విస్తరణ ఖాయమన్న చర్చ జోరుగా జరిగింది అప్పట్లో. కానీ... ఆ తర్వాతి నుంచి ఒకడు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కు అన్నట్టుగానే ఉంది పరిస్థితి.

పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా

..మిగతా 2 లో



# 60 దేశాలపై ట్రంప్ సుంకాల మోత

- ప్రపంచంలోని ప్రతి దేశంపై 10 శాతం సుంకం
- భారత్‌పై 26 కాదు, 27 శాతం
- ఏప్రిల్ 10 నుంచి అమలు
- ఆచితూచి స్పందించిన కేంద్రం

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

అమెరికాకు 'విముక్తి దినం'గా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతూ వచ్చిన ఏప్రిల్ 2 మిగతా ప్రపంచం పాలిట దుర్దినంగా మిగిలిపోయింది. భారత్‌తో పాటు ఏకంగా 60 పై చిలుకు దేశాలపై ఆయన వాణిజ్య కొరడా ఝుళిపించడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పెనుకుదుపుకు లోనైంది. వాళ్లూ, వీళ్లూ అని తేడా చూపకుండా అన్ని దేశాల మీదా 10 నుంచి 50 శాతం దాకా

..మిగతా 2 లో

# ఓటమిలో సన్‌రైజర్స్ హ్యాట్రిక్

- వరుసగా మూడో మ్యాచ్‌లోనూ పేలవ ప్రదర్శన
- కేకేఆర్‌పై 120 పరుగులకే ఆలౌట్
- చెలరేగిన కోల్‌కతా బ్యాటర్లు, బౌలర్లు
- సీజన్ 18లో రెండో విజయం నమోదు

**విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:**

ఐపీఎల్ సీజన్ 18లో సన్‌రైజర్స్ వరుస పరాజయాలను చవిచూస్తోంది. స్వంత మైదానం



ఈడెన్ గార్డెన్స్‌లో కూడా కోల్‌కతా బ్యాటర్లు, బౌలర్లు

..మిగతా 3 లో

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శుక్రవారం,
04.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# యువ డాక్టర్లు పేదలకు సేవలందించాలి

మొదటి పేజీ తరువాయి



ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న యువ డాక్టర్లు.. పీజీ పూర్తి చేసిన తర్వాత నల్లగొండ గడ్డ మీద ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆకాక్షించారు. అత్యవసర సమయంలో ప్రజలు తలుచుకునేది వైద్యులను మాత్రమేని.. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించి వారి మన్ననలు పొందాలని కోరారు. ప్రాణాలు కాపాడటమే ధ్యేయంగా పని చేయాలన్నారు. ప్రభుత్వ సర్వీస్‌ల్లో చేరి రోగులకు వైద్యం అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వైద్య, విద్యా రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఆరోగ్యశ్రీ కింద వైద్య పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. వివిద రాష్ట్రాల నుంచి వచ్చి ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఎక్కడ వైద్యం అందించినా నల్లగొండ గడ్డకు పేరు తీసుకురావాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రోగులకు వైద్య సేవలు అందించి మంచి పేరు తెచ్చుకుంటేనే వైద్యులకు కూడా తృప్తి ఉంటుందన్నారు. విదేశాల్లో పైచదువులు చదివినా తిరిగి దేశానికి, నల్లగొండ ప్రాంతానికి వచ్చి పని చేయాలని కోరారు. ఏ డిపార్టుమెంట్‌లో పని ఆలస్యం జరిగినా ఇబ్బంది అంతగా ఉండదని, వైద్యంలో మాత్రం అప్పటికప్పుడే స్పందించి వైద్యం అందిస్తేనే రోగులకు మేలు చేకూరుతుందన్నారు. అనంతరం ఎంబీబీఎస్, ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న 142 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీవాణి, వైస్ ప్రిన్సిపాల్ రామచంద్ర, సూపరింటెండెంట్ అరుణకుమారి, ప్రొఫెసర్లు శివకుమార్, రాజేంద్రకుమార్, స్వరూపరాణి, బద్రీనారాయణ, రాధాకృష్ణ, పుష్ప, వందన, ఉషశ్రీ, యామిని, అయేషా పాల్గొన్నారు.

## బాటసింగారంలో బర్డ్‌ఫ్లూ.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్లు అధికార యంత్రాంగం నిర్ధారించింది. రంగారెడ్డి జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డా.బాబు బేరి గురువారం బర్డ్‌ఫ్లూ వెలుగు చేసిన ఫామ్ వద్ద సిబ్బందితో కలిసి కోళ్లను చంపి మట్టిలో పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. సదరు పౌల్ట్రీ సామర్థ్యం 36వేల కోళ్లు కాగా.. వేలాది ఇప్పటికే మృతి చెందాయి. గురువారం 17,521 కోళ్లు ఉన్నట్లు గుర్తించారు. బాటసింగారానికి కిలో మీటరు పరిధిలోని అన్ని పౌల్ట్రీల్లో కోళ్లను పూడ్చనున్నారు. పది కిలోమీటర్ల పరిధిలో ఉన్న వాటిల్లో నమూనాలు సేకరిస్తున్నారు. వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టి.. ఎవరైనా బర్డ్‌ఫ్లూ లక్షణాలతో ఉంటే వారి వివరాలు సేకరిస్తున్నారు.

# అంత తొందరెందుకు..?

మొదటి పేజీ తరువాయి

ముందు ఉంచారు. వరుసగా వచ్చిన సెలవులను ఆసరాగా తీసుకొని ప్రభుత్వం వందలాది ఎకరాల్లోని అటవీ భూముల్లో కూల్చివేతలు చేపట్టినట్టు తెలిపారు. వీటిని పరిశీలించిన ధర్మాసనం కేసును సుమోటోగా స్వీకరించింది. కంచ గచ్చిబౌలిలో అటవీ నిర్మూలన చర్యలు జరిగినట్టు స్పష్టమవుతున్నదని తెలిపింది. ఆ ప్రాంతంలో ఎనిమిది రకాల అరుదైన జీవజాతులు నివసిస్తున్నాయని చెప్పున్నారని, వందల యంత్రాలతో ఆ ప్రాంతాన్ని ధ్వంసం చేసినట్టు కనిపిస్తున్నదని అన్నారు. ప్రభుత్వ చర్యలతో భారీ సంఖ్యలో వృక్షాలను నేల కూల్చినట్టు అర్థమవుతున్నదని పేర్కొన్నారు.



### ఒక్క చెట్టు కూడా కూల్చొద్దు..

మధ్యాహ్నం ధర్మాసనం విచారణ తిరిగి ప్రారంభించగా రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన నివేదికను ధర్మాసనం పరిశీలించింది. జస్టిస్ గవాయ్ స్పందిస్తూ.. 'కూల్చివేతలకు అవసరమైన అనుమతులు తీసుకున్నారా? ఇది చాలా తీవ్రమైన అంశం. చట్టాన్ని మీ చేతుల్లోకి ఎలా తీసుకుంటారు?' అని ప్రశ్నించారు. ప్రభుత్వ వివరణతో అఫిడవిట్‌ను దాఖలు చేస్తామని అగర్వాల్ సమాధానం ఇవ్వగా.. ధర్మాసనం పరిగణనలోకి తీసుకోలేదు. 'మొత్తం ఆపేయాలని ఆదేశిస్తున్నాం. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఒక చెట్టును కూడా కూల్చివేయొద్దు, ఎలాంటి పనులు జరగరాదు' అని ధర్మాసనం ఆదేశించింది. ఒకవేళ ఏమైనా పనులు జరిగినట్టు తేలితే ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నేరుగా బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

### తదుపరి ఆదేశాలొచ్చే వరకూ నో వర్క్

హైకోర్టు రిజిస్ట్రార్ ఇచ్చిన నివేదికను పరిశీలిస్తే.. కంచ గచ్చిబౌలి ప్రాంతంలో ప్రభుత్వం చేసిన విధ్వంసం కనిపిస్తున్నదని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. భారీగా యంత్రాలను మోహరించి దాదాపు 100 ఎకరాల్లో పనులు చేపట్టినట్టు, ఆ ప్రాంతాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నించినట్టు, భారీ సంఖ్యలో చెట్లను నరికేసినట్టు అర్థమవుతున్నదని అన్నారు. ఫొటోలను బట్టి చూస్తే ఆ ప్రాంతంలో నెమళ్లు, జింకలు ఇతర జీవజాతులు నివసిస్తున్నట్టు తెలుస్తున్నదని, కుంటలు కూడా ఉన్నట్టు స్పష్టమవుతున్నదని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ కేసును సుమోటోగా స్వీకరిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని ప్రతివాదిగా చేర్చాలని ఆదేశించారు. రిట్ పిటిషన్‌ను దాఖలు చేయాల్సిందిగా అమికస్ క్యూరీ పరమేశ్వర్‌కు సూచించారు. సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సీఈసీ)ని క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశించారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు చెట్లను సంరక్షించడం తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర పనులు చేపట్టవద్దని తేల్చి చెప్పారు.

### అటవీ నిర్మూలన చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చింది..?

అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్ట డానికి సంబంధించి సుప్రీంకోర్టు గత నెల నాలుగో తేదీన ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ధర్మాసనం ఉటంకించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెలరోజుల్లోపు నిపుణుల కమిటీని నియమించాలని ఆదేశించామని, కమిటీలు ఆరు నెల్లలోగా అధ్యయనం చేసి నివేదిక అందించాలని ఆదేశించామని గుర్తుచేసింది. ఈ లోగా ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ భూములకు నష్టం చేసే ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించామని పేరొన్నది. ఈ మేరకు తెలంగాణలో కమిటీ ఏర్పాటుచేసిన రెండు రోజుల్లోనే.. రాష్ట్ర ప్రభుత్వం వందల ఎకరాల్లో అటవీ నిర్మూలన చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితి ఏమొచ్చిందని ప్రశ్నించింది. రెండు మూడు రోజుల్లోనే దాదాపు 100 ఎకరాల్లో చెట్లను నరికి వేయడం పట్ల ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అకడ చెరువు ఉన్నదంటే.. చుట్టుపకల కచ్చితంగా క్యాచ్‌మెంట్ ఏరియా ఉంటుందని జస్టిస్ గవాయ్ పేరొనగా.. అవి అటవీ భూములు కాదని ప్రభుత్వం తరపు న్యాయవాది చెప్పారు. దీంతో 'అది అడివా? కాదా? అన్నది కాదు. చెట్లను తొలగించే ముందు మీరు సంబంధిత అనుమతులు తీసుకున్నారా? రెండు మూడు రోజుల్లోనే 100 ఎకరాల్లో చెట్లను తొలగించడం అంటే సామాన్య విషయం కాదు' అని జస్టిస్ గవాయి పేరొన్నారు. 'మీకు ఒక విషయం గుర్తు చేయదలచుకున్నాను.. మీరు ఎంతటి వారైనా సరే చట్టాన్ని మించినవారు కాదు' అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

### అఫిడవిట్ దాఖలుకు ఆదేశాలు..

చెట్ల నరికివేతకు అనుమతులు, పర్యావరణ మదింపు పత్రాలు, కొట్టేసిన చెట్లను ప్రభుత్వం ఏం చేసింది.. తదితర అంశాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అటవీప్రాంతాల గుర్తింపు కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో.. ఆ అంశంతో సంబంధం లేని పంచాయతీరాజ్, జీహెచ్ఎంసీ, మున్సిపల్ పరిపాలన, పరిశ్రమలు, హెచ్ఎండీఏలకు చెందిన అధికారులను ఎందుకు నియమించారో తెలపాలని పేర్కొంది. "కేంద్ర సాధికార సంస్థ (సీఈసీ) అధికారులు వ్యక్తిగతంగా ఆ ప్రాంతానికి వెళ్లి ఈ నెల 16వ తేదీలోపు నివేదిక సమర్పించాలి. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ ప్రస్తుతం అక్కడున్న చెట్లను సంరక్షించడం మినహా ఇతరత్రా ఎలాంటి కార్యకలాపాలూ చేపట్టకూడదని ఆదేశిస్తున్నాం" అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

మొదటి పేజీ తరువాయి



చూడటానికి వచ్చిన పర్యాటకులు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది ఊడిపోయిన పెచ్చులను శుభ్రం చేశారు. చార్మినార్‌కు మరోసారి మరమ్మతులు చేస్తామని అధికారులు చెప్పారు. అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వర్షం కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నారు. త్వరలోనే మరమ్మతులు చేపడతామని అధికారులు తెలిపారు. అలాగే జిల్లాల్లో పలుచోట్ల అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి.

**మరో మూడు రోజులు వానలు**

ఈ వానలు మరో మూడు నుంచి నాలుగు రోజుల వరకు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. రాష్ట్రంలో ఉత్తర తెలంగాణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ వడగండ్లతో వర్షం పడే సూచనలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే రైతులు, ప్రజలు వర్షం పడే సమయంలో భయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నేడు కురిసిన వర్షాలకు ఏపీలో ఇద్దరు, తెలంగాణలో ముగ్గురు పిడుగుపాటుకు గురై మృతి చెందారు. అందుకే వర్షం వచ్చే సమయంలో బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు.

# 60 దేశాలపై ట్రంప్ సుంకాల మోత

మొదటి పేజీ తరువాయి

సుంకాలు బాదడం ద్వారా ప్రపంచ వాణిజ్య యుద్ధానికి ట్రంప్ తెర తీశారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై బుధవారం సంతకం చేశారు. భారత్‌ను తప్పుడు వాణిజ్య విధానాలు అనుసరిస్తున్న 'దారుణ దేశం'గా ఈ సందర్భంగా అభివర్ణించారు! అన్నిరకాల భారత ఉత్పత్తుల మీదా 26 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించగా, అనంతరం దాన్ని 27 శాతంగా సవరించారు. అమెరికాకు అత్యవసరమైన ఫార్మాస్యూటికల్స్, సెమీ కండక్టర్లు, పలు ఖనిజాలు తదితరాలను మాత్రం సుంకాల బాదుడు నుంచి మినహాయించారు. అమెరికాలోకి ప్రవేశించే అన్ని వస్తూత్పత్తుల మీదా 10 శాతం బేసిక్ టారిఫ్ విధించారు. ఇది ఏప్రిల్ 5 నుంచి అమల్లోకి వస్తుంది. అమెరికా ఉత్పత్తులపై అధిక సుంకాలు వసూలు చేస్తున్న భారత్ తదితర దేశాలను వాణిజ్యపరంగా 'ధూర్త దేశాలు'గా ట్రంప్ ఆక్షేపిస్తుండటం తెలిసిందే. వాటిపై అదనపు సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. అవి ఏప్రిల్ 9 నుంచి అమల్లోకి రానున్నాయి. ఆ లెక్కన భారత ఉత్పత్తులపై 10 శాతం బేస్‌లైన్ టారిఫ్ ఏప్రిల్ 5 నుంచి, 27 శాతం అదనపు సుంకాల వసూలు ఏప్రిల్ 9 నుంచి మొదలవుతాయి. చైనాపై ఇటీవలే 20 శాతం సుంకాలు విధించగా మరో 34 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్టు ట్రంప్ తాజాగా ప్రకటించారు! ట్రంప్ నిర్ణయంతో అమెరికా వార్షిక పన్ను వసూళ్లు ఏటా 60 వేల కోట్ల డాలర్ల మేరకు పెరుగుతాయని వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో అంచనా వేశారు. ట్రంప్ ప్రకటనను దేశాలన్నీ దుయ్యబట్టాయి. అమెరికాపై ప్రతీకార సుంకాలు తప్పవని యూరోపియన్ యూనియన్, చైనా హెచ్చరించాయి. ట్రంప్ పునరాలోచించాలని పలు దేశాలు విజ్ఞప్తి చేశాయి. దీనిపై భారత్ ఆచితూచి స్పందించింది. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. "ట్రంప్‌కు అమెరికా ఫస్ట్ అయితే మోదీకి భారతే ఫస్ట్. దీనిపై ఎలా ముందుకెళ్లాలో ఆలోచిస్తాం" అన్నారు.

**మెరుగ్గా, బలంగా, దృఢంగా: ట్రంప్**

ప్రపంచ దేశాలపై తాను విధించిన తాజా సుంకాల మీద ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఆపరేషన్ ముగిసింది. రోగి బతికాడు. భేషుగ్గా ఉన్నాడు. చక్కగా కోలుకుంటున్నాడు. మునపటి కంటే పెద్దగా, మెరుగ్గా, బలంగా, ఎన్నడూ లేనంత దృఢంగా తయారవుతాడని తేలింది" అని ట్రూత్‌సోషల్‌లో కామెంట్ చేశారు.

# కేబినెట్ విస్తరణకు మళ్లీ బ్రేక్

మొదటి పేజీ తరువాయి



మరో ఆరుగుర్ని మంత్రులుగా తీసుకునే వెసులుబాటు ఉన్నా... రాష్ట్ర నాయకత్వం ఆ అవకాశాన్ని ఉపయోగించుకోవడం లేదన్న ఫీలింగ్ ఎక్కువ అవుతోందట కాంగ్రెస్ నేతల్లో. దాంతో కేబినెట్ విస్తరణ ఎంత ఆలస్యం అయితే...సమస్య అంత జటిలంగా మారుతుందన్న అభిప్రాయం పెరుగుతోంది. అసలు నేడో, రేపో అన్నంతగా మూడ్ వచ్చి ఎందుకు ఆగిందని అంటే... రకరకాల కారణాలు కనిపిస్తున్నాయంటున్నారు పరిశీలకులు. ఎప్పుడూ లేనిది ఈసారి మాదిగ సామాజిక వర్గం ఎమ్మెల్యేలు తమ కోటా కోసం అధిష్టానానికి లేఖలు రాయడం, ఎస్టీ సంఘాల నాయకులు రాహుల్ గాంధీని కలిసి గిరిజనులకు కేబినెట్‌లో అవకాశం ఇవ్వమని కోరడం లాంటి పరిణామాలు జరిగాయి. ఇంతలోనే మా జిల్లాకు మంత్రి పదవి ఇవ్వండంటూ.. రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు తెర మీదకు వచ్చారు. ఇన్నాళ్లు మౌనంగా ఉన్న సీనియర్ లీడర్ జానారెడ్డి...రంగారెడ్డి జిల్లా నేతలకు మంత్రి పదవి ఇవ్వాలంటూ సిఫారసు లేఖలు రాయడం కలకలం రేపింది. ఇవన్నీ కలగలిసి కొత్త సమస్యలు సృష్టించాయా అన్న ప్రశ్నలు వస్తున్నాయట. కేబినెట్ బెర్త్‌ల సంగతి ఫైనల్‌గా తేల్చేది పార్టీ అధిష్టానమే. కానీ...వాళ్ళు మీనమేషాలు లెక్కించడానికి ఈ లెక్కలు కుదరకపోవడమేనా? అంతకు మించి ఇంకేమన్నా కారణాలున్నాయా అన్నది అంతు చిక్కడం లేదంటున్నారు రాష్ట్ర నాయకులు.

వీలైనంత త్వరగా కేబినెట్ విస్తరణ చేసుకుని పరిపాలనలో ఇంకా స్పీడ్ పెంచాలని అనుకుంటున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. కానీ... విస్తరణ వ్యవహారం ఎప్పటికప్పుడు దగ్గరకు వచ్చినట్టే వచ్చి ఆగిపోతోంది. ఏప్రిల్ 3..4 తేదీల్లో ఉంటుందని అందరు లెక్కలు వేసుకున్నారు. విస్తరణ అజెండాతోనే... సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్ ఢిల్లీ వెళ్ళినా... రాహుల్ గాంధీ పార్లమెంట్ సమావేశాలతో బిజీగా ఉన్న కారణంగా క్లారిటీ రాలేదని తెలుస్తోంది. ఇక ఈ నెల 8..9న గుజరాత్ లో పార్టీ సమావేశాలు ఉన్నాయి. విస్తరణ ఉంటే గింటే...ఆ సమావేశాల తర్వాతనే అన్నది ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. అంటే... ఆ ప్రకారం ఈనెల 11, 12 వరకు ఆగుతారా లేక ఆలోపే చేస్తారా అన్న విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది. ప్రస్తుతానికి అయితే మాత్రం పాజ్ ఇచ్చినట్టేనంటున్నారు. ఎప్పుడు రిలీజ్ అవుతుందో చూడాలి మరి.

**ఇబ్బందులున్నాయన్న పీసీసీ చీఫ్**

గురువారం నాడు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీకి వెళ్లి అధిష్టానం పెద్దలతో భేటీ అయ్యారు. అనంతరం పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. మంత్రివర్గ విస్తరణలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని.. అవి తొలగిపోయిన తర్వాతే విస్తరణ ఉంటుందని తెలిపారు. త్వరలో ఏఐసీసీ మంత్రివర్గ విస్తరణ తేదీలను ప్రకటిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత కేబినెట్‌లో ఇద్దరు బీసీలు ఉన్నారని.. మరో ఇద్దరికి అవకాశమివ్వాలని తాను అధిష్టానాన్ని కోరినట్లు తెలిపారు. అలాగే ఈసారి మంత్రివర్గంలో మైనార్టీలకు తప్పకుండా అవకాశం ఉంటుందని అన్నారు.

# ప్రజల ఎదుట న్యాయమూర్తులఆస్తులవివరాలు

మొదటి పేజీ తరువాయి



వెబ్ సైట్ లో బహిరంగంగా ఉంచాలని నిర్ణయం తీసుకున్నారు. సంప్రదాయంగా ఫుల్ కోర్టు అంటే... సుప్రీంకోర్టు న్యాయమూర్తులంతా సమావేశం కావడం. కేసుల విచారణ.. ఇతర అంశాలపై చర్చిస్తారు. ఇలాంటి ఫుల్ కోర్టు సమావేశంలో ఆస్తులన్నీ ప్రజల ముందు ఉంచాలన్న ప్రతిపాదనకు అందరూ అంగీకారం తెలిపారు. ఇప్పటి వరకూ ఉన్న నిబంధనల ప్రకారం సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా నియమితులు కాగానే ఆస్తుల వివరాలను చీఫ్ జస్టిస్ కు సమర్పించాల్సి ఉంటుంది. ఆ వివరాలు రికార్డుల్లో ఉంటాయి. కానీ పబ్లిక్ కు అందుబాటులో ఉంచలేదు. ఇప్పుడు మాత్రం న్యాయమూర్తుల ఆస్తులు పబ్లిక్ గా ఉంటాయి. ఇటీవల ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా దుమారం రేగింది. ఈ క్రమంలో మరింత పారదర్శకత అవసరం అని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు భావించినట్లుగా తెలుస్తోంది. సుప్రీంకోర్టు న్యాయూర్తులను ఆదర్శంగా తీసుకుని హైకోర్టు జడ్జిలు.. అలాగే ఇతర కోర్టుల న్యాయమూర్తులు కూడా .. తమ తమ ఆస్తుల వివరాలను బహిరంగ పరుస్తారని భావిస్తున్నారు.

మార్చి 14న దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలోని స్టోర్ రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. అప్పుడే ఆయన ఇంట్లో నుంచి పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. అందులో కొంత వరకూ కాలిపోయింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి ముగ్గురు న్యాయమూర్తుల కమిటీని ఏర్పాటు చేశారు. జస్టిస్ యశ్వంత్ వర్మకు కొంతకాలం పాటు ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలను అప్పగించకూడదని కూడా నిర్ణయించారు. జస్టిస్ యశ్వంత్ వర్మ 2014 అక్టోబర్‌లో అలాహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అలహాబాద్ హైకోర్టులో జడ్జీగా ఏడేళ్లు పనిచేసిన తర్వాత, 2021 అక్టోబర్ 11న దిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆయన చాలా కీలక తీర్పులు ఇచ్చారు. అయితే ఆయన తన ఇంట్లో దొరికిన తన డబ్బు తనది కాదని అంటున్నారు. ఈ ఘటన బయటపడిన తర్వాత న్యాయవ్యవస్థలో జవాబుదారీదనం పై చర్చ పెరిగింది. ఈ క్రమంలో న్యాయవ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వసనీయత పెరిగేలా చేయడానికి కొన్ని సంస్కరణలు అవసరమని చాలా మంది మీడియాలో.. సోషల్ మీడియాలో మాట్లాడటం ప్రారంభిచారు. న్యాయమూర్తులను నియమించే కొలీజియం వ్యవస్థపైనా చర్చ జరుగుతోంది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
04.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**బాల్కొండ,విశాలభారతి**

భీమ్‌గల్ మండలం పల్లికొండ గ్రామంలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ షబ్బీర్,ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగ వారు మాట్లాడుతు...రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలని,ఎలాంటి తప్పా,తాలు లేకుండా చూసుకోవాలని,కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్న ఐకెపి మహిళాలకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎపిఎం రవీందర్,ఎపిఓ నర్సయ్య,సిసి లలిత,కార్యదర్శి రామ్,విడిసి సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# జై బాపు,జై భీమ్,జై సంవిదాన్ పాదయాత్ర

- కార్యక్రమం పాల్గొన్న ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్,బాల్కొండ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్

**బాల్కొండ,విశాలభారతి:**

ఏఐసీసీ,పీసీసీ ఆదేశాల మేరకు జైబాపు,జై భీమ్,జై సంవిదాన్ పాదయాత్ర కార్యక్రమం భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో గురువారం మండల,పట్టణ కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎన్ఎస్యుఐ అధ్యక్షుడు,ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, బాల్కొండ నియోజకవర్గం ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్,రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షులు రామ్మూర్తి గోపి హాజరయ్యారు.ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ...రాజ్యంగంపై ప్రజల్లో అవగాహన కల్పించారు.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అనంతరం అంగడి బంజర్ లో ఉన్న రేషన్ షాపును సందర్శించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొద్దిరి స్వామి,పట్టణ అధ్యక్షులు జె.జె నర్సయ్య,డిసిసి డెలికేట్ కుంట రమేష్,ఎస్సీ సెల్ అధ్యక్షులు అనంతరావు,ఎస్టీ సెల్ అధ్యక్షులు గోపాల్ నాయక్,బీసీ సెల్ అధ్యక్షులు రాజు,జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగేంద్ర,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ చరణ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవినాష్,మహిళా అధ్యక్షురాలు కల్పన,నాయకులు వాక మహేష్, మల్లెల లక్ష్మణ్, సుంకర సురేష్,నల్లూరి శీను, అంజుమ్,జుబేర్,నవీన్,సాయి బాబా,పిట్ట మహేష్,పల్లె శేఖర్, నల్లూరి గంగమణి,సాయమ్మ, ఎంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ ప్రూఫ్ లేకుండా ఇండ్లు కిరాయికి ఇవ్వకండి

- జవహర్ నగర్ పీఎస్ పరిధిలోని వికలాంగుల కాలనీలో కార్డన్ సర్చ్
- మల్కాజిగిరి డీసీపి పద్మజ

**జవహర్ నగర్, విశాలభారతి:**

ఎటువంటి ప్రూఫ్ లేకుండా ఎవరికి ఇండ్లు కిరాయికి ఇయ్యవద్దని మల్కాజిగిరి డీసీపి పీవి పద్మజ తెలిపారు. శుక్రవారం జవహర్ నగర్ పోలిస్టేషన్ పరిధిలోని వికలాంగుల కాలనీలో సీపి సుధీర్ బాబు ఆదేశాలమేరకు మల్కాజిగిరి డీసీపి పద్మజ కార్డన్ సర్చ్ నిర్వహించారు.ఈ సర్చ్ లో వికలాంగుల కాలనీలోని 24 వ బ్లాక్ లో సుమారుగా



లిక్కర్ బాటిల్స్ స్వాధీనం చేసిన చేశారు. ఈ కార్డన్ సర్చ్ లో 130 మంది పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలలో ఎవ్వరైనా అనుమానంగ కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు

# వక్ఫ్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం

మొదటి పేజీ తరువాయి

విపక్షాలు పట్టుబట్టాయి. వాటి సవరణలన్నీ వీగిపోయాయి. చివరికి బిల్లు ఆమోదం పొందింది. దానికి అనుకూలంగా 128, వ్యతిరేకంగా 95 ఓట్లు పడ్డాయి. వక్ఫ్ బిల్లును కేంద్రం ఇక రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం అది చట్టంగా రూపుదాల్చుతుంది. వక్ఫ్ బిల్లును లోక్‌సభ 288-232 ఓట్లతో ఆమోదించడం తెలిసిందే.

**ముస్లింల హక్కుల పరిరక్షణ కోసమే: కిరణ్ రిజిజు**

వక్ఫ్ బిల్లుపై గురువారం అర్ధరాత్రి దాకా జరిగిన వాడివేడి చర్చ పెద్దల సభను వేడెక్కించింది. ఉమీద్ (యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫీషియన్సీ అండ్ డెవలప్‌మెంట్)గా పేరు మార్చిన వక్ఫ్ (సవరణ) బిల్లు-2025ను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు సభలో ప్రవేశపెట్టారు. బిల్లుకు నిరసనగా పలువురు విపక్ష సభ్యులు నల్లదుస్తులు ధరించి సభకు వచ్చారు. బిల్లు రాజ్యాంగ విరుద్ధమంటూ మండిపడ్డారు. ముస్లింల భూములను లాక్కోవడమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని ఆరోపించారు. విపక్షాల వాదనను రిజిజు ఖండించారు. వాటి అభ్యంతరాలను తోసిపుచ్చారు. "ముస్లింల హక్కులను ఎవరూ లాక్కోబోవడం లేదు. ఈ విషయమై విపక్షాలు చేస్తున్నదంతా దుర్ప్రచారమే" అని పేర్కొన్నారు. "2004లో 4.9 లక్షలుగా ఉన్న వక్ఫ్ ఆస్తులు ఇప్పుడు ఏకంగా 8.72 లక్షలకు పెరిగాయి. తద్వారా దేశంలో వక్ఫ్ అతి పెద్ద ప్రైవేటు భూ యజమానిగా అవతరించింది" అని వివరించారు. "వక్ఫ్ వ్యవహారాల్లో పారదర్శకత, జవాబుదారీతనం తేవడం, వాటి ఆస్తులను మరింత సమర్థంగా నిర్వహించడం, ముస్లిం మహిళలకు సాధికారత కల్పించడం, ముస్లింలలోని అన్ని తెగల హక్కులనూ పరిరక్షించడమే బిల్లు లక్ష్యం. అంతే తప్ప మతంతో ఈ బిల్లుకు ఎలాంటి సంబంధమూ లేదు" అని పునరుద్ఘాటించారు. "అందుకే సున్నీలు, షియాలతో పాటు ముస్లింలలోని ఇతర వెనకబడ్డ వర్గాల వారు కూడా వక్ఫ్ బోర్డుల్లో సభ్యులుగా ఉంటారు. తద్వారా వారి ప్రయోజనాలకూ న్యాయం జరుగుతుంది. ఇందుకు ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు" అన్నారు. "కేంద్ర వక్ఫ్ మండలి సభ్యుల్లో అధిక సంఖ్యాకులు ముస్లిమేతరులే ఉంటారనడం అవాస్తవం. 22 మందిలో వారి సంఖ్య 4కు మించబోదు. వక్ఫ్ బోర్డులు చట్టపరమైన సంస్థలు. అంతే తప్ప కేవలం ముస్లింలకు ప్రాతినిధ్యం వహించే సంస్థలు కాదు. వక్ఫ్ ట్రిబ్యునళ్ల ముందు 31,999 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వివాదాస్పద వక్ఫ్ భూముల్లో ఇప్పటికే కోర్టుల్లో పరిష్కారమైన వాటి జోలికి పోబోం. పసలేని ఆరోపణలు మాని బిల్లును ఆమోదించడంలో విపక్షాలు కూడా కలసి రావాలి" అని కోరారు.

## జడ్చర్ల ఎమ్మెల్యే పర్యటనలో వివాదం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పర్యటనలో గురువారం ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. వ్యక్తిగతంగా చోటు చేసుకున్న వివాదం కాస్తా రెండు పార్టీల మధ్య ఘర్షణకు దారితీసింది. నియోజకవర్గంలోని బాలానగర్ మండలంలో జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే హేమాజీపూర్, కోయిలకుంటతండాలో కార్యక్రమం ముగించుకొని బిల్డింగ్‌తండాకు వెళ్తుండగా ఆయన సోదరుడు దుశ్యంత్‌రెడ్డి కారును కోయిలకుంటతండా వద్ద అడ్డుకున్నారు. ఆ తండాలో పొలం బాట విషయంలో స్థానిక కాంగ్రెస్, భారాస కార్యకర్తల మధ్య వివాదం నెలకొంది. ఈ వివాదం ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా రాజుకుంది. ఇరువర్గాలు తమ సమస్యను లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని ఎస్సై లెనిన్ సూచించి ఎమ్మెల్యే పర్యటనకు మార్గం సుగమం చేశారు.

# ప్రభుత్వ నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలి

- హెచ్ సియు జీవవైవిద్యాన్ని కాపాడాలి
- విమలక్క

**హైదరాబాద్,విశాలభారతి:**

ప్రపంచ పర్యావరణ సంస్థ అరుణోదయ సాంస్కృతిక సమైక్య పీడీఎస్ యు విజృంభణ సంస్థల ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలోని హైదర్గూడాలో ఎన్ఎస్ఎస్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమ నాయకురాలు ప్రముఖ ప్రజాగాయని పర్యావరణ పరిరక్షణ సంస్థ కార్యవర్గ సభ్యురాలు కామ్రేడ్ విమలక్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల మీద జరిపిన దమనకాండము ప్రతి ఒక్కరు ఖండించాలి, ముఖ్యంగా ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే



పున సమీక్షించుకొని అనేక రకాల జీవవైవిద్యాలకు జీవులకు ఆవాసంగా ఉన్న 400 ఎకరాల భూమిని వారసత్వ సంపదను ప్రభుత్వం కాపాడాలి రాజకీయాలకు పోకుండా పంతాలకు పోకుండా విద్యార్థుల మీద జరిగిన గమన కాండను ప్రభుత్వం వెంటనే ఆలోచించాలి హైదరాబాద్ నగరంలో జరుగుతున్న ఈ పోరాటం అంతర్జాతీయ స్థాయిలో అనేక సమస్యలు అనేక మంది ఈరోజు విద్యార్థి లోకానికి మూగజీవులకు బాసటగా నిలుస్తాయి. అరుణోదయ సాంస్కృతిక సమైక్య సహజ వనరుల సంరక్షణ కోసం జీవజాతి సంరక్షణ కోసం ఎన్నో పాటలు ఎన్నో ఉద్యమాలు నిర్వహించడం జరిగింది. నేడు విద్యార్థులు చేస్తున్న పోరాటం కూడా న్యాయబద్ధమైనది విద్యార్థి పోరాటానికి అందరం బాసటగా నిలుద్దాం అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రపంచ పర్యావరణ సంస్థ డాక్టర్ గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ధమనకాండను ప్రతి ఒక్కరు ఖండించాలి ముఖ్యంగా విద్యార్థులపై జరిగిన దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలి ప్రభుత్వం పంతాలకు పోకుండా విద్యార్థులు చేస్తున్న పోరాటాన్ని మానవీయ కోణంలో పర్యావరణ పరిరక్షణ కోణంలో అర్థం చేసుకొని అనేక రకాల జంతువులు అర్ధనాదాలతో అర్ధరాత్రి రోడ్ల మీదికి వచ్చి ఏడుస్తూ దిక్కు తోచని స్థితిలో జాతీయ పక్షి రాష్ట్ర జంతువు ఎంతో దయనీయమైన స్థితిలో అర్ధనాదాలు చేస్తున్నాయని అన్నారు.



# తెలంగాణ అంబేద్కర్ సంఘం తిమ్మాపూర్ గ్రామ కమిటీ ఎన్నిక...

- గౌరవ అధ్యక్షుడిగా గూడెం శ్యామ్, అధ్యక్షుడిగా దామెర తరుణ్, ప్రధాన కార్యదర్శిగా గూడెం నాగరాజ్
- అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలి
- తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల చేరాలు, జిల్లా కోకన్వీనర్ రాజమౌళి పిలుపు

**విశాలభారతి,ఎల్కతుర్తి:**

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా గూడెం శ్యామ్, అధ్యక్షుడిగా దామెర తరుణ్, ఉపాధ్యక్షుడిగా గూడెం దినేష్, ప్రధాన కార్యదర్శి గూడెం నాగరాజు, సంయుక్త కార్యదర్శి వెల్తురు ప్రశాంత్, కోశాధికారి గూడెం దినేష్, కమిటీ సభ్యులుగా తాళ్ల పెల్లి రంజిత్ గౌడ్, మడిపల్లి రమేష్, శ్రీరాముల కృష్ణమూర్తి, సందెల శ్రీకాంత్, గూడెం లింగయ్య, వెల్తూరి గణేష్, గాజుల రమేష్, కానుకుంట్ల శంకరాచారి, దుర్శనపు రాజమౌళి, పసుల జగదీష్, మూల బాలకృష్ణ గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఎన్నిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల చేరలు, జిల్లా కో కన్వీనర్ సాతూరి రాజమౌళిలు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ పట్టణ కార్యదర్శిగా కంది బండ సూరయ్య


**సూర్యాపేట,విశాలభారతి:**

తెలంగాణ స్టేట్ ఆర్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సూర్యాపేట పట్టణ శాఖ కార్యదర్శిగా కుక్కడపు సూరయ్యను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు ఆరే రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో పట్టణ కార్యదర్శిగా ఉన్న మహంకాళి సోమయ్య సంఘ నియమాలకు విరుద్ధంగా పనిచేస్తున్నందున రాష్ట్ర అధ్యక్షులు ఆదేశానుసారం 11 మంది సభ్యులుగా గల క్రమశిక్షణ కమిటీ నిర్ణయ మేరకు ప్రాథమిక సభ్యత్వాన్ని, కార్యదర్శి పదవిని తొలగించినట్లుతెలిపారు. ఇప్పటినుండి సోమయ్యకు టాస్కాకు ఎలాంటి సంబంధం లేదనీ, వారికి ఎలాంటి సభ్యత్వ రుసుములు కానీ ఇతర సమస్యలపై అప్లికేషన్లు, డబ్బులు ఇచ్చినచో టాస్కా ఎలాంటి బాధ్యత వహించదన్నారు. టాస్కా సూర్యాపేట పట్టణ శాఖలో ఏర్పడిన కార్యదర్శి పోస్టు సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్న కందిబండ సూరయ్య ను పట్టణ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సర్వసభ్య సమావేశంలో ఘనంగా సన్మానించి బాధ్యతలు ఇవ్వనైనది. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి గుడుగుంట్ల విద్యాసాగర్, కోశాధికారి బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, పట్టణ అధ్యక్షులు ఎస్.భాస్కరాచారి, కోశాధికారి మిరియాల సుధాకర్, గౌరవ సలహాదారులు కర్నాటి కిషన్, దా0డ్గే సుభాష్, ట్రిబనల్ మెంబర్స్ కాకి మల్లారెడ్డి, ఎస్ అన్నపూర్ణమ్మ సభ్యులు దండ వెంకట్ రెడ్డి, కేశవులు, సుజాత, లక్ష్మమ్మ ,పిచ్చమ్మ, కమలమ్మ, ముకుంద రెడ్డి, సురేందర్ రెడ్డి , 60 మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు.

# ఓటమిలో సన్‌రైజర్స్ హ్యాట్రిక్

మొదటి పేజీ తరువాయి

చెలరేగారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై తమ హవాను కొనసాగించారు. ఏకంగా 70 పరుగుల తేడాతో విజయం సాధించారు. ముందు బ్యాటింగ్‌లో వెంకటేష్ అయ్యర్ (29 బంతుల్లో 3 సిక్స్‌లు, 7 ఫోర్లతో 60), రఘువంశీ (50) తర్వాత వైభవ్ అరోరా (3/29) రాణించడంతో కోల్‌కతా సునాయాస విజయం సాధించింది. ఈ సీజన్‌లో హైదరాబాద్‌కు ఇది వరుసగా మూడో పరాజయం. కోల్‌కతాకు ఈ సీజన్‌లో ఇది రెండో గెలుపు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతాకు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. డికాక్ (1)ను ప్యాట్ కమిన్స్, సునీల్ నరైన్ (7)ను మహ్మద్ షమీ పెవిలియన్‌కు చేర్చాడు. 16 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన కోల్‌కతాను రహానే, రఘువంశీ ఆదుకున్నారు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు 80 పరుగులు జోడించారు. ఆ తర్వాత వెంట వెంటనే వీరిద్దరూ అవుటైపోయారు. ఆ దశలో క్రీజులోకి వచ్చిన



వెంకటేష్ అయ్యర్ (60), రింకూ సింగ్ (32) వేగంగా బ్యాటింగ్ చేసి కీలకమైన పరుగులు చేశారు. దీంతో కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 200 పరుగులు చేసింది. హైదరాబాద్ బౌలర్లలో కమిన్స్, షమీ, అన్సారీ, మెండిస్, హర్షల్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. అనంతరం ఛేజంగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఈ భారీ ఛేజింగ్‌లో కీలకమైన ట్రావిస్ హెడ్ (4)ను వైభవ్ అరోరా తొలి ఓవర్లనే అవుట్ చేశాడు. ఆ వెంటనే అభిషేక్ శర్మ (2), ఇషాన్ కిషన్ (2) కూడా పెవిలియన్ చేరారు. కొద్దిసేపు క్రీజులో ఉన్న నితీష్ (19), మెండిస్ (27) మంచి ఆరంభాన్ని భారీ స్కోరుగా మర్చలేకపోయారు.



అనికేత్ వర్మ (6) కూడా ఎక్కువసేపు క్రీజులో ఉండలేకపోయాడు. క్లాసెన్ (33) వేగంగా ఆడే క్రమంలో అవుటయ్యాడు. దీంతో హైదరాబాద్ 16.4 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌటైంది. కోల్‌కతా బౌలర్లలో వైభవ్ అరోరా, వరుణ్ మూడేసి వికెట్లు తీశారు. రసెల్ రెండు వికెట్లు పడగొట్టాడు. హర్షిత్ రాణా, సునీల్ నరైన్ ఒక్కో వికెట్ తీశారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
04.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## నిరోద్యోగులకు శుభవార్త

నారాయణపేట, విశాలభారతి:

సేవభారతి, ఇన్ఫోసిస్, నిర్మణ్ ఆధ్వర్యంలో నారాయణపేట చిట్టెం నర్సిరెడ్డి డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 4 న ఉద్యోగ మేళా నిర్వహిస్తునట్టు సేవ భారత్ విభాగ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ ప్రకటన చేసారు. పది, ఐటిఐ, ఇంటర్ పూర్తి చేసిన డిగ్రీ చదువుతున్న విద్యార్థులు శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే మేళా లో హాజరై తమ భవిషత్ ప్రణాళికకు బాట వేసుకోగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాక్సకాన్, ఆవిష్కరణ్, ప్రీమియర్స్ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఆసక్తి గల వారు ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్లు, ఫోటోలతో హాజరు కావాలని కోరారు.



# డివిజన్ లోని ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్,కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి.

ఎల్బీనగర్,విశాలభారతి:

మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ ప్రాంతంలోని నూతనంగా ఏర్పాటు చేసుకున్న శ్రీ వెంకటేశ్వర నగర్ కాలనీలో మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ ఫ్లోర్ లీడర్,స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు .ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతనంగా భూగర్భ డ్రైనేజ్ లైన్లకు సుమారు రూ 23.00 లక్షల వ్యయంతో సాంక్షన్ కావడం జరిగింది డ్రైనేజీ లైన్లు నిర్మించుకున్న తర్వాత మరో 4 నుండి 5 నెలల్లో సి.సి రోడ్లు నిర్మించుకుందామని, డ్రైనేజీ లైన్ల కొరకు సరైన లెవెల్స్ ను సమకూర్చేందుకు ముందుగా జలమండలి అధికారులను పిలిపించి పర్వేక్షించిన అనంతరం పనులను ప్రారంభించుకుందామని కాలనీవాసులు తెలియజేశారు.అదేవిధంగా చుట్టుపక్కల ఉన్న కాలనీవాసులకు చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాల లో వేయకుండా దయచేసి స్వచ్ఛ ఆటో లోనే వేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సభ్యులు వెంకటయ్య, నాగేశ్వరరావు, నునావత్ చిన్నయ్య,రమేష్, సత్యనారాయణ,శివప్రసాద్,చందు మరయు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాలరావు ప్రజాప్రభుత్వంపై విమర్శలా

- దొంగే దొంగ అన్నట్లు ఉంది
- కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్

కూకట్ పల్లి, విశాలభారతి:



గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి అక్రమాలను సాక్షాధారాలతో సహా బయట పెడతామని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ హెచ్చరించారు.హెచ్సీయూ భూముల వివాదాన్ని విద్యార్థులను ముందు పెట్టి రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు.కూకట్పల్లి శాసనసభ్యుడు మాధవరం కృష్ణారావు హెచ్ సి యు భూములపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సీఎం ముఖ్యమంత్రిని విమర్శించడంపై ఆయన ఘాటుగా స్పందించారు.దొంగే దొంగ అన్నట్లు కృష్ణారావు తీరు ఉందన్నారు.గత 10ఏళ్లలో కూకట్పల్లి నియోజకవర్గంలో చెరువులు కుంటలు శిఖం భూములు చివరకు నాలాలను సైతం వదలకుండా కబ్జా చేసాడని వీటన్నింటి వ్యవహారం బయటకు తీస్తామని ఎమ్మెల్యే తీరును ఎండగడతామని రమేష్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత ప్రభుత్వానికి చెందిన ప్రతి ఇంచ్ భూమిని కాపాడుకుంటున్నామని హౌసింగ్ బోర్డ్ కు చెందిన ప్రతి కాళీ స్థలానికి ఫెన్సింగ్ వేస్తున్నామన్నారు. యూనివర్సిటీ కి చెందిన ఒక అడుగు భూమి కూడా ప్రభుత్వం తీసుకోదని విద్యార్థులు ఆందోళన విరమించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమం పేరుతో 1200 మంది విద్యార్థులను బలిగొన్న చరిత్ర బిఆర్ఎస్ ది అని ఇప్పుడు కూడా హెచ్సీయూ విద్యార్థులను రాజకీయంగా వాడుకోవాలని చూస్తోందన్నారు. హెచ్సీయూ భూమి వివాదం పై బీఆర్ఎస్ బిజెపి విధానాలపై రమేష్ బాలానగర్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం 16 గంటలు పనిచేస్తున్నారని పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించారన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం రాజీవ్ యువ వికాసం, స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతకు శిక్షణ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కేసీఆర్ చెప్పిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రేషన్ కార్డులు ఇతర సంక్షేమ కార్యక్రమాలు కేవలం నోటిమాటలకే పరిమితమయ్యాయని బండి రమేష్ విమర్శించారు. సన్న బియ్యం తో పాటు మరో 9 నిత్యావసర వస్తువుల కిట్ ను ప్రజలకు త్వరలోనే అందించనున్నట్లు ఆయన తెలిపారు. బిఆర్ఎస్ కు ఇక భవిష్యత్తులో పుట్టగతులు ఉండబోవన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల నాగిరెడ్డి , తూము వేణు,లక్ష్మయ్య, దండగుల యాదగిరి, పుష్ప రెడ్డి ,గోపిశెట్టి రాఘవేంద్ర,కుక్కల రమేష్,మేకల రమేష్,మధు గౌడ్, ఐజాచ్,శివ చౌదరి, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# థాంక్స్.. హరీషన్న

- హరీష్ రావును కలిసిన 'ఆదర్శ్ రెడ్డి' దంపతులు

పటాన్ చెరు,విశాలభారతి:



పటాన్ చెరు నియోజకవర్గం బిఆర్ఎస్ సమన్వయకర్తగా నియమితులైన సందర్భంగా వెన్నవరం ఆదర్శ్ రెడ్డి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావును కలిశారు. గురువారం తన సతీమణి భారతినగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డితో కలిసి హైదరాబాద్ నగరంలోని మాజీ మంత్రి హరీష్ రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంలో సహకరించినందుకు ఆదర్శ్ రెడ్డి దంపతులు హరీష్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని హరీష్ రావు వారిని సూచించారు.



# సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసి అందచేసిన ఎమ్మెల్యే జీఎంఆర్

పటాన్ చెరు,విశాలభారతి:

ఆపత్కాల సమయంలో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరు డివిజన్ కి చెందిన సురేందర్ రావు కుమార్తె కీర్తి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా సీఎం ఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రెండు లక్షల 60 వేల రూపాయల విలువైన ఎల్ఓసి నీ కీర్తి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అందచేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాణిక్ ప్రభు, శ్రీ రాములు, రాజన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే వెంకట్రావు చేతుల మీదుగా సన్న బియ్యం పంపిణీ

వాజేడు, విశాలభారతి:

కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు గురువారం ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద పెద్ద భూస్వాములే కాదు పేదవాడు కూడా సన్నబియ్యంతో అన్నం తినాలని పేదింటికల సహకారం చేయడం కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంచి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క పేదవారు వినియోగించుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా వాజేడ్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద 18 లక్షల రూపాయలతో మంజూరైన షాపింగ్ కాంప్లెక్స్ భవనానికి శంకుస్థాపన చేశారు. తదనంతరం మూతబడ్డ శివాలయం గుడిని సందర్శించి దాని అభివృద్ధి కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు దీనితో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాజేడు తాసిల్దార్ శ్రీనివాస్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పూణెం రాంబాబు ఎంపీ ఓ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ బాబు, మాజీ జెడ్పిటిసి తలడి పుష్పలత, రాణిమేకల రాంబాబు మాజీ సర్పంచ్ తల్లి ఆదినారాయణ, ఏపీవో రాజు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు చల్లటి నీటిని ఏర్పాటు చేయాలి

- బిటిపిఎస్ లారీలకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలి
- బిటిపిఎస్ సిఐటియు అధ్యక్షుడు శ్రీరామ్ సతీష్

పినపాక, విశాలభారతి:



బిటిపిఎస్ కార్మికులకు వేసవిని దృష్టిలో పెట్టుకొని కూల్ వాటర్ సప్లై చేయాలని డిమాండ్ చేసిన బిటిపిఎస్ సిఐటియు అధ్యక్షుడు శ్రీరాం సతీష్కుమార్. ఎండలు మండి పోతున్న వేళ బిటిపిఎస్ కార్మికులు పని చేస్తున్నటువంటి కార్మికులందరూ చల్లటి నీరు లేక అవస్థలు పడుతున్నారు. అని వారన్నారు. వీరికి తక్షణమే మొదటి యూనిట్ రెండవ యూనిట్ మూడవ యూనిట్ నాలుగవ యూనిట్ నందు చల్లటి నీటి సదుపాయం కల్పించాలని బిటిపిఎస్ సిఐటియు ఆఫీసు నందు డిమాండ్ చేశారు. ఎండలు మండిపోతున్న వేళ ఉదయం 8: 30 కి వచ్చిన కార్మికులు సాయంత్రం 5: 30 వరకు కార్మికులు పని చేయడం జరుగుతుందని తెలియజేశారు. కార్మికులందరికీ మంచినీరు సరఫరా లేనందువలన బాగా ఇబ్బంది పడుతున్నారు అని అన్నారు. కావున అధికారులు వేసవికాలం కాబట్టి దృష్టిలో పెట్టుకొని కార్మికులకు కూల్ వాటర్ సప్లై చేయాలని నాలుగు యూనిట్లు కార్మికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని బీటిపిఎస్ సిఐటియు అధ్యక్షులు శ్రీరామ్ డిమాండ్ చేయడం జరిగినది. అంతేకాకుండా బి టి పి ఎస్ మెయిన్ గేటు ఎదురుగా బొగ్గు లారీలను డ్రైవర్లు ఇరువైపులా రోడ్డు పక్కన పెట్టడం వలన వెహికల్స్ వెళ్లేందుకు దారి లేకుండా ట్రాఫిక్ జామ్ అవుతుందని గేటు ముందు ఇరువైపులా బూడిద లారీలు, బొగ్గు లారీలు ఇరువైపులా పెట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా పిటిపిఎస్ అధికారులపై ఉందని శ్రీరామ్ సతీష్ బిటిపిఎస్ అధికారులను కోరారు.



# ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు

దేవరుప్పల, విశాలభారతి:

మండలకేంద్రంలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించిన పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు,మాజీ మండల అధ్యక్షుడు ఉప్పుల సురేష్ బాబు,మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న,ఎస్సీ,ఎస్టీ,బిసి అధ్యక్షులు ఇనుముల నాగరాజు,భూక్యా సజ్జన్,కాడబోయిన గణేష్,ఎన్ఎస్ యుఐ అధ్యక్షుడు కొంగరి ఉమేష్,మండల నాయకులు బోనగిరి యాకస్వామి,రామచందర్ నాయక్,మోలుగూరి యాకయ్య,ఓడపెల్లి రవి,రెడ్డిరాజుల రమేశ్, వెంకన్న, అశోక్,భాస్కర్, యాకన్న, ఉప్పలయ్య, శ్రీను, రవి, తదితరులు పాల్గొన్నారు.



# మినరల్ వాటర్ ప్లాంట్ను ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని

దేవరుప్పల, విశాలభారతి:

గొల్లపల్లి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి. ఈ కార్యక్రమంలో టిపీసీసీ సభ్యుడు డాక్టర్.లక్ష్మి నారాయణ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు,మాజీ మండల అధ్యక్షుడు ఉప్పుల సురేష్ బాబు,మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న,మహిళా మండల అధ్యక్షురాలు భోగాల మాలతి రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకన్న,ఎస్సీ,ఎస్టీ,బిసి అధ్యక్షులు ఇనుముల నాగరాజు,భూక్యా సజ్జన్,కాడబోయిన గణేష్,ఎన్ఎస్ యుఐ అధ్యక్షుడు కొంగరి ఉమేష్,మండల నాయకులు బోనగిరి యాకస్వామి,రామచందర్ నాయక్,మోలుగూరి యాకయ్య,ఓడపెల్లి రవి ,రెడ్డిరాజుల రమేశ్, అంజయ్య,వెంకన్న, అశోక్, భాస్కర్, యాకన్న, ఉప్పలయ్య, శ్రీను,రవి,కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాల్లు, కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రతి ఇంటికి తాగునీరు అందించాల్సిందే

- నీటి ఎద్దడి కారణంగా ప్రజలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదు
- పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు

పినపాక, విశాలభారతి:

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఇప్పట్నుంచే తగిన చర్యలు చేపట్టాలని వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం పినపాక మండల పరిషత్ కార్యాలయంలో వేసవి మంచినీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా ముందస్తుగా అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 23 గ్రామపంచాయతీలలో గల గ్రామాల్లో ఎన్నిరోజులకు తాగునీటి సరఫరా చేస్తున్నారని, భూగర్భ జలాలు అడుగంటే అవకాశం ఉన్నందువలన నీటి సమస్య ఉత్పన్నమయ్యే గ్రామాలను గుర్తించి బోర్లను లోతు తవ్వడం, కొత్తబోర్లు అవసరమయ్యే ప్రాంతాలను గుర్తించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు నాలుగు రోజులలో ఆయా గ్రామాల్లో పనులు చేయించాలన్నారు. ముందస్తుగా అన్ని గ్రామాల్లో వాటర్ ట్యాంకులు శుభ్రం చేసుకోవాలని, మంచినీటి పైపులను మరమ్మతులు చేయాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో సునీల్, తాసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్, ఏ ఇ బ్రహ్మ దేవ్, గ్రిడ్ ఏఈ మహేందర్ రెడ్డి, 23 గ్రామ పంచాయతీల సెక్రటరీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
04.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



**దేవరుప్పల, విశాలభారతి:**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 98వ జయంతి సందర్భంగా కడవెండి గ్రామంలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన కురుమ సంఘం అధ్యక్షులు మెటికె ఆంజనేయులు కురుమ,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం అహర్నిశలు పోరాడారు. వారి పోరాటం మరువలేనిది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంగ వీరస్వామి, ప్రధాన కార్యదర్శి కర్రే మల్లేష్, మెటికె చంద్రశేఖర్, దొడ్డి బిక్షపతి,మెటికే ప్రవీణ్, మెటికె వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చెయ్యాలి

- మధుయాష్కీ గౌడ్ డిమాండ్.
- కార్పొరేటర్ సుజాత నాయక్ కు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి క్షమాపణ చెప్పాలి.
- అవమానించినందుకు కాళ్లు కడిగి నెత్తిన పోసుకొని క్షమాపణ కోరాలి.
- కేసు నుంచి కాపాడాలని అసెంబ్లీ లాబీలలో సీఎం, మంత్రుల కాళ్లు పట్టుకొని వేడుకుంటున్నాడు.
- కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంటే.. దొంగ చాటున కొబ్బరికాయలు కొట్టడం సిగ్గుచేటు
- ఈనెల 7న మంత్రి శ్రీధర్ బాబు చేత నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు



**ఎల్బీనగర్,విశాలభారతి:**

కార్పొరేటర్ సుజాత నాయక్ పై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సహించరానివని.. సుధీర్ రెడ్డికి నీతి, నిజాయితీ సిగ్గు , శరం, లజ్జ ఉంటే సుజాత నాయక్ కాళ్ళు మొక్కి క్షమాపణ వేడుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. వనస్థలిపురం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధు యాష్కి గౌడ్ మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలను గౌరవించాల్సిన సంస్కారం , సభ్యత సుధీర్ రెడ్డి కి లేదని విమర్శించారు. గిరిజన మహిళ కార్పొరేటర్ వ్యక్తిత్వాన్ని అవమానిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన సుధీర్ రెడ్డి ఇప్పటి వరకు క్షమాపణ చెప్పకపోవడం దుర్మార్గమన్నారు. మీ ఇంట్లో కూడా మహిళలు ఉన్నారు కదా..? ఇలానే ఎవరైనా మాట్లాడితే ఊరుకుంటావా ? అని ప్రశ్నించారు. ఏమాత్రం నీతి , నిజాయితీ ఉన్న సుధీర్ రెడ్డి .. కార్పొరేటర్ కాళ్లు కడిగి నెత్తిన నీళ్లు చల్లుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సుధీర్ రెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయినందున న్యాయపరంగా పోరాటం ఉంటుందని, పోలీసులు కూడా వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. చేసిన తప్పుకు క్షమాపణ చెప్పకపోగా.. కాపాడాలని అసెంబ్లీ లాబీలలో సీఎం, మంత్రుల కాళ్ల పట్టుకొని బతిమిలాడుతున్నాడని ఆరోపించారు. సుధీర్ రెడ్డి మాట్లాడిన మాటలు సభ్య సమాజం అసహ్యించుకుంటుందని, ఆయన పార్టీ అధినేత కేసిఆర్ కూడా క్షమించటం లేదని పేర్కొన్నారు. సమయం వచ్చినప్పుడు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధికి గత బీఆర్ఎస్ పాలనలో పది సంవత్సరాలలో రాని నిధులు 15 నెలల తమ రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంలో వచ్చాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, మా ప్రభుత్వం.. నిధులు మంజూరు చేస్తే తట్టుకోలేక, దొంగ చాటున భూములు కబ్జాలు చేసే గల్లీ లీడర్లు, రౌడీ షీటర్లను గంజాయి బ్యాచ్ లను వెంటవేసుకొని వెళ్లి సుధీర్ రెడ్డి కొబ్బరికాయలు కొడుతూ శంకుస్థాపనలతో డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. మీ తొట్టి గ్యాంగుల ఆటలు సాగవని హెచ్చరించారు. పార్కులకు తాళాలు వేస్తున్నారని అబద్ధాలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నాడని, పార్కుల పేరుతో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అక్రమ సంపాదనతో సుధీర్ రెడ్డి వేలకోట్లకు ఎదిగాడని ఆరోపించారు. మలక్ పేట్ లో సుధీర్ రెడ్డి సైకిల్ పై తిరిగే రోజుల్లో, తాను బైక్ పై తిరిగానని.. కానీ అక్రమ సంపాదనతో ఈరోజు సుధీర్ రెడ్డి వేల కోట్లకు పడగలెత్తాడని విమర్శించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి ఆధ్వర్యంలో ప్రోటోకాల్ ప్రకారం అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతాయని అన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా అభివృద్ధి పనులకు తాను సహకరిస్తున్నానని, రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేపట్టాలన్నదే తన ఉద్దేశమన్నారు. ఈనెల 7న ఎల్బీనగర్ నియోజకవర్గం లో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవానికి జిల్లా ఇన్చార్జి మంత్రి గారు శ్రీధర్ బాబు హాజరు అవుతున్నారని పేర్కొన్నారు. ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే కూడా వచ్చి కొబ్బరికాయ కొట్టవచ్చునని పేర్కొన్నారు. అంతేకాని తన జేబులో నుంచి డబ్బులు ఇస్తున్నట్లుగా దొంగ చాటుగా కొబ్బరికాయలు కొట్టి.. చిల్లర రాజకీయాలు చేయవద్దు అని హెచ్చరించారు. మంత్రి హాజరయ్యే రోజున కొబ్బరికాయ కొట్టి ఆ నీళ్లు నెత్తిన చల్లుకొని సుజాత నాయక్ ని క్షమాపణ కోరాలని హితవు పలికారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర రెడ్డి , బానోతు సుజాత నాయక్ , పీసీసీ సెక్రటరీ గజ్జి భాస్కర్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు నర్సింహా యాదవ్ , చెన్నగోని రవీందర్ గౌడ్ , శ్రీపాల్ రెడ్డి , దిండి శశిధర్ రెడ్డి , మంజుల రెడ్డి , వేణుగోపాల్ యాదవ్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్ , బుడ్డా సత్యనారాయణ , నేలపాటి రామారావు , గణేష్ నాయక్ గారు, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పసుపులేటి సాయి నికేష్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, గజ్జి శ్రీనివాస్ యాదవ్, దాము మహేందర్ యాదవ్,బండిగారి శ్రీనివాస్ గౌడ్, కళ్లెం సుజాత రెడ్డి, వసంత, రాజేశ్వరి, రజిని రావు, ఎస్టీ సెల్ ఎల్బీనగర్ అధ్యక్షులు రమేష్ నాయక్, భీమీడి రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## బిటి రోడ్డు పనులకు భూమి పూజ

**మద్దూర్,విశాలభారతి**

దమ్గన్‌పూర్ గ్రామంలో దమ్గన్‌పూర్ నుండి లక్ష్మీపూర్ మరియు శుద్ధబండ తాండ బిటి రోడ్డు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికీ కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షులు గుల్ల నర్సింహ మరియు కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది బీములు మాజీ జెట్పీసీ రఘుపతి రెడ్డి మాజీ కోఆప్షన్ ఇబ్రహీం అలగే కోస్గి మార్కెట్ డైరెక్టర్ పోలీస్ రవీందర్ రెడ్డి దంగనపూర్ కాంగ్రెస్పార్టీ అధ్యక్షుడు కాశప్ప గౌడ్.రుక్మా రెడ్డి సుదర్శన్ గౌడ్. సాయప్ప ముస్తఫా దంగనపూర్ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు ప్రసాద్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రాజశేఖర్ రెడ్డి మారుతీ గౌడ్ గ్రామ ప్రజలు యువత పాల్గొన్నారు.



## కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే యశస్విని

**దేవరుప్పల, విశాలభారతి:**

మండలకేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 34 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో మహిపాల్ రెడ్డి,ఎంపిడిఓ లక్ష్మీ నారాయణ,స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, టిపిసీసీ సభ్యుడు డాక్టర్.లక్ష్మీ నారాయణ నాయక్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వడ్లకొండ తార,మండల మహిళా అధ్యక్షురాలు బోగాల మాలతి రెడ్డి,మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న,ఎస్సీ,ఎస్టీ,బిసి అధ్యక్షులు ఇనుముల నాగరాజు,భూక్యా సజ్జన్, కాడబోయిన గణేష్, కొంగరి ఉమేష్, ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు,మహిళా నాయకురాల్లు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 76వ వార్షికోత్సవం

- చిలుక మధుసూదన్ రెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

పెద్దఅంబర్ పేట మున్సిపాలిటీ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి 76 వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఉదయం ఏర్పాటు చేసిన రథోత్సవం మరియు దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆశీస్సులు పొందిన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భీమగొని భాస్కర్ గౌడ్,పోలోజు బ్రహ్మచారి,సుర్వి ప్రవీణ్ గౌడ్, సంధిల రోహిత్ గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## సమగ్ర గ్రామల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**ఆమనగల్లు,విశాలభారతి:**

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని టిపిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్మన్ యాట గీత నర్సింహా అన్నారు.కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలోని 10 లక్షల నిధులతో సీసీ రోడ్లు పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రుణమాఫీతో పాటు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని, గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిచ్య నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ,కే. హిరాసింగ్ నాయక్, చేగురి వెంకటేష్,శేఖర్ గౌడ్,తులసిరామ్, విటలయ్య గౌడ్,శాబుద్దీన్, బిక్కు,రాందాస్, భగత్,రాజు,కిషన్, సుమన్,సాయికుమార్,పీటర్,సికిందర్,చందన్ గ్రామస్తులు పాల్గొన్నారు.




## నేటి ప్రస్థానం తెలుగుదినపత్రిక ప్రారంభం

- కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి

**పెద్ద అంబర్ పెట్, విశాలభారతి:**

మన్సూరాబాద్ లోని మల్లికార్జున నగర్ లో ఆర్ జీ వి మీడియా అధినేత రాఘవేంద్ర ఏర్పాటుచేసిన నేటి ప్రస్థానం తెలుగు దినపత్రిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్, హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి , మరియు మన్సురాబాద్, బి.యన్.రెడ్డి డివిజన్ కార్పొరేటర్లు కొప్పుల నరసింహా రెడ్డి ,మొద్దు లచ్చి రెడ్డి , బిజెపి మల్కాజ్గిరి పార్లమెంటు జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ మరియు తదితరులు పాల్గొన్నారు



## యువత తమ ఆలోచనలకు అనుగుణంగా స్వయం ఉపాధిలో సమృద్ధి సాధించాలి

- మాజీ ఎంపీపీ అనిత విజయ్

**ఆమనగల్లు,విశాలభారతి:**

యువత తమకు నచ్చిన రంగాలలో ఉన్నత స్థానాలను చేరుకోవాలంటే తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని స్వయం సమృద్ధి సాధించాలని అమనగల్లు మాజీ ఎంపిపి అనిత విజయ్ కోరారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ సమీపంలో జయేందర్ నాయక్ నూతనంగా ఏర్పాటు చేసిన జయేంద్ర ధరణి పోర్టల్ కమ్యూనికేషన్ షాప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాజీ ఎంపీపీ అనిత మాట్లాడుతూ యువత ఆర్థికంగా ఎదిగినప్పుడే అన్ని రంగాలలో రాణించగలరని, తమకు నచ్చిన రంగాన్నిన ఎంచుకొని ఆర్థికంగా స్థిరపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడిగడ్డ గ్రామపంచాయతీ మాజీ ఉప సర్పంచ్ మల్లేష్ నాయక్ మీసేవ కేంద్రం కోటేష్, భిచ్యా నాయక్ ,మేడిగడ్డకు యువకులు జయరాం ,రాజ్ కుమార్ , లాలు, రమేష్ , కుమార్ , రఘు, మల్లేష్ , సునీల్ పాల్గొన్నారు.



## తట్టి అన్నారంలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి

- మున్సిపల్ మేనేజర్ కిరణ్ కి సీపీఎం వినతి
- సిపిఎం పార్టీ అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ

**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**

పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ లోని తట్టి అన్నారం గ్రామంలో సర్వే నెంబర్ 105లో భారీ అక్రమ నిర్మాణాలను కూల్చేయాలని మున్సిపాలిటీ మేనేజర్ కిరణ్ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ, తట్టి అన్నారం మాజీ ఎంపిటిసి నల్ల ప్రభాకర్ మాట్లాడుతూ, సర్వేనెంబర్ 105 లో మున్సిపాలిటీ నుండి ఎటువంటి పర్మిషన్లు తీసుకోకుండా కొంతమంది రాజకీయ నాయకుల అండతో మున్సిపాలిటీ కి రావాల్సిన భారీ ఆదాయాన్ని గండి కొడుతూ కొంతమంది జేబులు నింపుకొని ఎవరు వచ్చి ఫిర్యాదు చేసిన ఎంతో కొంత డబ్బులు అప్ప చెప్పి, యదేచ్చగా, పెద్ద అంబర్ మున్సిపాలిటీలో అక్రమాలు నిర్మాణాలు చోరుగా చేస్తున్నారు. ఇప్పటికీ అక్రమ నిర్మాణాల మీద ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి ఫలితం లేకపోగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికీ మేము ఫిర్యాదు చేసిన అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయకపోతే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మరియు సిడిఎంఎలను కలసి ఫిర్యాదు చేస్తామని అప్పటికి స్పందించకపోతే వందల మందితో మున్సిపాలిటీ ఆఫీసుని ముట్టడి చేస్తామని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి హెచ్చరించారు. వెంటనే మున్సిపాలిటీ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుక్క రవికుమార్, జగన్ రెడ్డి, ఎండి యాకూబ్, పాల్గొన్నారు.



vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శుక్రవారం,
04.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com

6

GENERAL NEWS

## అక్రమంగామోరంతరలిస్తున్న జెసిపి ట్రాక్టర్లు సీజ్



**ఆర్మూర్,విశాలభారతి:**
ఆర్మూరు మండలంలోని ఫతేపూర్ గ్రామ శివారులో గురువారం అనుమతి లేకుండా అక్రమంగా మోరం తరలిస్తున్న జెసిబి మరియు ఐదు ట్రాక్టరు లనుసీజ్ చేసి డ్రైవర్లపై మరియు ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు ఆర్మూర్ సీఐ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఆర్మూర్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.



# పేద ప్రజల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

- ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిచడమే ప్రజా ప్రభుత్వం ఉద్దేశం
- తాజా మాజీ వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి,
- హయత్ నగర్ మండల రైతు సహాయ సహకార సంఘం అధ్యక్షులు చామ కృష్ణారెడ్డి వెల్లడి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**
రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ గ్రామంలో గురువారం ఉదయం సన్నబియ్యం పంపిణీ పథకాన్ని పెద్ద అంబర్పేట్ మున్సిపల్ తాజా మాజీ వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి మరియు హయత్ నగర్ మండల రైతు సహకార సంఘం అధ్యక్షులు చామ కృష్ణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చామ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఉదయం పెద్ద అంబర్ మున్సిపాలిటీలోని కుంట్లూరు గ్రామంలోని రేషన్ షాప్ వద్ద రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రజా ప్రభుత్వం అందించిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంను తాజా మాజీ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి అలాగే రైతు సహకార సంఘం అధ్యక్షులు చామకృష్ణారెడ్డి ప్రారంభించారు.దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టడం గర్వించదగ్గ విషయమన్నారు.పేద ప్రజలు గుండె చప్పుడు మన ప్రజా ప్రభుత్వం అన్నారు.ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిచడమే మన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశమని అన్నారు, ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ తాజా మాజీ కౌన్సిలర్ శ్రీరాములు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ఓరుగంటి కొండల గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు మరియు గ్రామ పెద్దలు,మహిళలు,యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హెచ్సియు భూముల వేలాన్ని నిలిపివేయాలి

- టిఆర్ఎస్ పార్టీ ఉద్యమ నేత సింధం శ్రీకాంత్



**కూకట్ పల్లి, విశాలభారతి:**
శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని సెంట్రల్ యూనివర్సిటీ భూములు అన్యాక్రాంతం అవుతుంటే స్థానిక ఎమ్మెల్యే అరకిపూడి గాంధీ మౌనం ఎందుకు వహిస్తున్నారంటూ సిందం శ్రీకాంత్ ప్రశ్నించారు.ఆచరణలో సాధ్యం కానీ హామీలు ఇచ్చి నెరవేర్చడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు.రేవంత్ సర్కార్ సంపద సృష్టించడం చాతకాక జీవవైవిధ్యానికి ఎంతగానో ఉపయోగపడే విలువైన సెంట్రల్ యూనివర్సిటీ భూముల మీద కన్నేసి భూములను అమ్మాలని చూడడం సిగ్గుచేటని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు న్యాయవాది సింధం శ్రీకాంత్ రేవంత్ సర్కార్ పై మండిపడ్డాడు.యూనివర్సిటీ భూముల అమ్మకాలని ఆపాలంటూ నిరసన తెలుపుతున్న విద్యార్థులపై అమానుషంగా లాఠీచార్జులు చేసి కేసులు బనాయించడం కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుడుతనానికి నిదర్శనమని ఆయన అన్నారు.గతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణ అంటూ ఉదరగొట్టే ఉపన్యాసాలు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి కి ఇప్పుడు పర్యావరణ సంరక్షణ వన్యప్రాణి పరిరక్షణ అనే విషయాలు గుర్తుకు రాలేదా అంటూ ప్రశ్నలు సంధించారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి సంపద సృష్టించడం చేతకాక సెంట్రల్ యూనివర్సిటీ భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి సొమ్ము చేసుకోవాలని చూస్తుందని ఆయన ఎద్దేవా చేశారు.ఇదే పరిస్థితులు కొనసాగితే పర్యావరణ దెబ్బతిని జీవవైవిద్యాన్ని కోల్పోవడమే కాక రాబోయే రోజుల్లో ఢిల్లీ తరహా కాలుష్యం పెరిగి హైదరాబాద్ నగరంలో పీల్చడానికి స్వచ్ఛమైన గాలి కరువై ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఇలాంటి దుర్మార్గమైన చర్యలను మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.ఇంత దుర్మార్గం తన నియోజకవర్గంలో జరుగుతున్న స్థానిక ఎమ్మెల్యే ఆర్కెపూడి గాంధీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఒకవైపు బీఆర్ఎస్ పార్టీ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ ఉంటే మరొకవైపు బిఆర్ఎస్ ఎమ్మెల్యేని అని చెప్పుకునే అరికెపూడి గాంధీ ఎందుకు మాట్లాడలేదన్నారు.నిజంగా ఆయన బిఆర్ఎస్ పార్టీలోనే ఉంటే ఇకనైనా మనం వీడి ఎమ్మెల్యే గాంధీ బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజల పక్షాన నిలబడాలని డిమాండ్ చేశారు.



# ట్యాంక్ బండిపై దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- మందుల సత్యం

**మునుగోడు, విశాలభారతి:**
కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య 98వ జయంతిని పురస్కరించుకొని మునుగోడు మండల కేంద్రంలో గల దొడ్డి కొమరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా మందుల సత్యం మాట్లాడుతూ ట్యాంక్ బండిపై దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వరంగల్ లో ఏర్పాటు చేసి విమానాశ్రయానికి దొడ్డి కొమరయ్య పేరు పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేవైసీఎస్ మునుగోడు నియోజకవర్గ ఇన్చార్జి మందుల సత్యం కేవైసీఎస్ నల్గొండ జిల్లా సహాయ కార్యదర్శి వాలే నాగరాజు కురుమ, కేవైసీఎస్ మునుగోడు మండల సహాయ కార్యదర్శి బండారు మహేష్ కురుమ డోలు దెబ్బ నాయకులు మల్గా యాదయ్య కురుమ, బండారు కృష్ణ కురుమ, బండారు సురేష్ కురుమ, మెట్టు శంకర్, సురేష్, గురుపాదం, తదితరులు పాల్గొన్నారు







# వార్షికోత్సవంలో అంబరాన్ని అంటిన సాంస్కృతిక సంబరాలు

- హాజరైన మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్ రావు

**విశాలభారతి,భీమదేవరపల్లి :**
మండలంలోని ముల్కనూర్ గ్రామంలోని ఎస్.ఆర్.కె ఇంగ్లీష్ మీడియం స్కూల్ 15 వ, వార్షికోత్సవం విద్యార్థులు తల్లిదండ్రులతో ఎంతో ఉత్సాహంగా బుధవారం సాయంత్రం జరిగింది. విద్యార్థులు వివిధ రకాల డాన్సులు, పాటలతో, వేషాలతో అలరించారు.

**విద్యార్థులు ఉన్నత శిఖరాలను అవరోదించాలి**
**- మాజీ ఎమ్మెల్యే అడిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి**
విద్యార్థిని విద్యార్థులు తమ లక్షాలని నిర్దేశించుకొని అత్యున్నత శిఖరాలని చేరుకోవాలని అన్నారు. క్రమశిక్షణతో పాఠశాల పేరు నిలబెట్టాలని సూచించారు. అలాగే క్రీడలు, విద్య ఇతర రంగాలలో రాణిస్తే గుర్తింపు లభిస్తుంది అని అన్నారు. పాఠశాల మేనేజ్మెంట్ నెలకు ఒకసారి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల పూరోభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.

**10 వ తరగతి వరకు అప్ గ్రేడ్**
స్కూల్ కరస్పాండెంట్, ఛైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి మాట్లాడుతూ, స్కూల్ 15 వ, వార్షికోత్సవం విద్యార్థులతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పిల్లలకు ఇలాంటి ఈవెంట్స్తో ఎంతో ఆక్టివ్గా తయారవుతారని అన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో (202526) తమ స్కూల్లో నర్సరీ నుంచి 10 వ, తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు శనిగరం సదానందం, పచ్చునూరి సురేష్ మాట్లాడుతూ, ఇలా వార్షికోత్సవ వేడుకలు స్కూలు యాజమాన్యం నిర్వహించడం వల్ల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటారని అన్నారు.





**ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు**
యుకేజి పూర్తి చేసుకున్న విద్యార్థులకు బుధవారం రోజు గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పట్టాలు, ధ్రువీకరణ పత్రాలను ముఖ్యఅతిథి అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, ట్రస్మ చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్ రావు, మండల విద్యాధికారి సునీతరాణి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కాశిరెడ్డి ఆదిరెడ్డి తమ పాఠశాలలో యూకేజి పిల్లలకు పిల్లలకు నిర్వహించిన కార్యక్రమాలను వారు సాధించిన విజయాలను విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియజేసి వారిని అభినందించడం జరిగింది.

**కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యానందిస్తున్న ఎస్ ఆర్ కె**
**- అలిగిరెడ్డి సుదర్శన్ రెడ్డి**
గత 15 సంవత్సరాలుగా దినదినాభివృద్ధి చెందుతూ, విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించడంలో పురోగతిని సాధిస్తున్నామని అన్నారు. పట్టణ ప్రాంత పాఠశాలలకు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్నారని, అందుకు పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని అన్నారు.

**భారతదేశంలోనే నాణ్యమైన విద్యకు "లీడ్"**
**- నిఖిల్ లీడ్ గ్రూప్ సీనియర్ అడ్వైజర్**
గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయికి అందించాలని సంకల్పంతో "లీడ్" ఆడియో, వీడియో విజువలైజేషన్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "లీడ్" డిజిటల్ తరగతుల బోధనలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని అన్నారు.

**కార్యక్రమంలో పాల్గొన్నవారు**
ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పీవీ మదన్మోహన్, హుస్నాబాద్ ట్రస్మా నాయకులు నరసింహారెడ్డి, కే నారాయణరెడ్డి, బుర్ర రాజేందర్, శ్రీధర్ రెడ్డి, సురేందర్ రెడ్డి హుజరాబాద్ ట్రస్మ నాయకులు రాజ్ కుమార్, కోటేశ్వర్, మహిపాల్ రెడ్డి భీమదేవరపల్లి ట్రస్మా నాయకులు యాదగిరి, రాజేశం, గోపాల్ రెడ్డి, అశోక్ హడుప్ప నాయకులు వాసుదేవ రెడ్డి, సత్య భూషణ్ విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# ఘనంగా ఈద్ మిలాప్


**హైదరాబాద్,విశాలభారతి:**
ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ముస్లిం ఉద్యోగులు, విశ్వవిద్యాలం ఉద్యోగులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. ముఖ్యదితిగా యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ అల్దామాస్ జానయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ విద్యాసాగర్, ముఖ్య ఆడితీగ తెలంగాణ నాన్ గజాట్టెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్, యూనివర్సిటీ, అగ్రికల్చర్ కాలేజీ అసోసియేట్ డీన్ డాక్టర్ గవర్దన్, ప్రొఫెసర్ నియాజహ్మద్ హుస్సేన్, డాక్టర్ లతీఫ్ పాషా, డాక్టర్ అలీబాబా తదితరులు పాల్గొన్నారు.



# ఆర్మూర్ లో గంజాయి రౌడీయిజం తగ్గుముఖం

- విలేకరులతో చిట్ చాట్ లో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి వెల్లడి

**ఆర్మూర్, విశాలభారతి;**
ఆర్మూర్లో గంజాయి, రౌడీయిజం తగ్గుముఖం పట్టాయని చిట్ చాట్ కార్యక్రమంలో తెలిపారు. అంకాపూర్ లోని ఆయన నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి పనులలో భాగంగా హైదరాబాదులో అధిక సమయం ఉండాల్సి వచ్చిందని అన్నారు. ప్రజలతో త్వరలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి, సమస్యలు తెలుసుకొని పరిష్కారం దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తానని తెలిపారు. గడిచిన ఏడాదిన్నర పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి పలువురు విలేకరులు సలహాలు సూచనలు అందించారు.



# ప్రభుత్వ అనుమతి లేకుండా ఆస్పత్రిలు నడిపితే కఠిన చర్యలు

- డిప్యూటీ డాక్టర్.డిఎంహెచ్ఓ రమేష్

**ఆర్మూర్,విశాలభారతి:**
ప్రభుత్వ అనుమతి లేకుండా ఆస్పత్రులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డిఎంహెచ్ఓ డా.రమేష్ తెలిపారు. గురువారం నందిపేట్ లోని ప్రైవేట్ ఆస్పత్రిల రిజిస్ట్రేషన్ లను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఆవరణలను పర్యవేక్షించి, డెలివరీలు అవుతున్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిద్ధి వినాయక హాస్పిటల్ (లేబరేటరీ) రక్త పరీక్ష కేంద్రలు శ్రీ వెంకటేశ్వర డెంటల్ హాస్పిటల్ ను తనిఖీ చేశారు. డిఎంహెచ్వో వెంట డాక్టర్ ప్రవీణ్, సాయి, కృష్ణమూర్తి, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, హెల్త్ సూపర్వైజర్ భాస్కర్ ఉన్నారు.



# నూతన డిఎస్పీని కలిసిన సూర్యాపేట టౌన్ సిఐ, ఎస్ఐలు

**సూర్యాపేట,విశాలభారతి:**
సూర్యాపేట నూతన డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ పార్థసారధిని సూర్యాపేట సీఐ వీర రాఘవులు, ఎస్సైలు ఏడుకొండలు, సాయిరాం, సైదులు, ఆంజనేయులు, ప్రవీణ్ కుమార్ డీఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. బెట్టింగ్, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. స్థానిక సమస్యలపై అవగాహన పెంచుకుని.. సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందిస్తామన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా ప్రజలు తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.



# నియోజకవర్గ అభివృద్ధి చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు

- హరీష్ రావు చేసేదే అసత్య ప్రచారాలు
- పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్

**ఆమనగల్లు,విశాలభారతి:**

దక్షిణ తెలంగాణ అభివృద్ధిని చూసి హరీష్ రావు, కేటీఆర్ ఓర్వలేక పోతున్నారని పిసిసి సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. కడ్తాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో ప్రజా సంక్షేమ పాలన నడుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు 22 వేల కోట్ల రూపాయలతో దాదాపు 26 లక్షల మంది రైతులకు అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపు రుణమాఫీ చేసి, సన్న వడ్లకు 500 రూపాయలు బోనస్ ఇచ్చి రైతులకు పెద్దన్నగా నిలిచారన్నారు దేశంలో ఎక్కడ లేని విధంగా భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేవంత్ రెడ్డి దేశంలో ఎక్కడ చేయని విధంగా రాష్ట్రంలో జనగణనతో పాటు కులగణన చేసి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ బీసీల సంఖ్య తేల్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ విద్యా ఉద్యోగ స్థానిక ఎన్నికల్లో ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపించిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. గిరిజన లంబాడలకు ఏమి చేయలేదని మాట్లాడిన హరీష్ రావు మీరు మర్చిపోయారా.. కాంగ్రెస్ పార్టీ గతంలో లంబాడాలు బీసీ ఈ గ్రూపులో ఉంటే ఇందిరాగాంధీ, ఎస్టీల్లో చేర్చి రిజర్వేషన్లతో పాటు అన్ని సదుపాయాలు కల్పించి ఆదుకున్నారన్నారు.ఉద్యోగాలు ఇస్తామన్న మాట మీద సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసిన గొప్పతనం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెల్లుతుందన్నారు. హాస్టల్ విద్యార్థులకు ఎక్కడి లేని విధంగా మెస్ ఛార్జీలు మరియు కాస్మొటిక్ ఛార్జీలు పెంచారన్నారు. మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500లకే గ్యాస్ సిలిండర్, 10లక్షలు ఆరోగ్యశ్రీ, రైతు రుణమాఫీ, వ్యవసాయ ఉపాధి కూలీలకు రైతూ భరోసా వంటి హామీలను నెరవేర్చామన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు రాజీవ్ యువ వికాస్ పథకం కింద రాయితీలతో అండగా నిలుస్తుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కోన్ని వందల కోట్లు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తుంటే ఇక్కడి నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులకు మింగుడు పడక ప్రజలలో అంధకారం అయిపోతామని అసత్య ప్రచారాలతో ప్రగతిని అడ్డుకుంటురన్నారు. రేవంత్ రెడ్డి మాటల మనిషి ఆని, చేతల మనిషి రోజుకు 18 గంటలు పనిచేస్తూ ఈ రాష్ట్రంలో అన్ని రంగాల్లో ముందు తీసుకుపోవాలని కృతనిత్యంతో ఉన్న నాయకుడున్నారు.ధర్నాలు ఉద్యమాలు చేస్తే అరెస్టు చేస్తున్నారని దెయ్యాలు వేదాలు వెళ్ళించినట్టు గతంలో ధర్నా చౌక్ ఎత్తేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదనీ అన్నారు.. గతంలో ఏనాడు దక్షిణ తెలంగాణ వైపు చూడని నాయకులు, ఉత్తర తెలంగాణను మాత్రం అభివృద్ధి చేసిన నాయకులు నేడు దక్షిణ తెలంగాణ అభివృద్ధిని చూసి అడ్డుకట్ట వేస్తుంటే ప్రజలు సహించలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు హోన్మ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్,
రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు అశోక్, మండల యూత్ అధ్యక్షుడు బోస్ రవి, మల్లేష్ గౌడ్, రామచందర్ నాయక్, మంకీ శ్రీను, శంకర్ నాయక్, భానుకిరణ్, శ్రీకాంత్, తులసీ రాం, బుచ్చయ్య, శ్రీను, కృష్ణ మరియు తదితరులు పాల్గొన్నారు.



# పార్టీలో యూత్ కాంగ్రెస్ విభాగం కీలకం

- యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా ప్రచార వేదికగా ప్రతి ఒక్కరు పనిచేయాలి.
- సూర్యాపేట,తుంగతుర్తి మాకు రెండు కండ్లు.
- ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి.
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి.

**సూర్యాపేట,విశాలభారతి:**

కాంగ్రెస్ పార్టీలో యూత్ కాంగ్రెస్ విభాగం కీలకమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి,యువజన కాంగ్రెస్ సూర్యాపేట జిల్లా ఇన్చార్జి పాలకూర్ల రవికాంత్ గౌడ్ అన్నారు. గురువారం సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర యూత్ కమిటీ ,మాజీ మంత్రి,కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్చార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ యూత్ కాంగ్రెస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ నేతృత్వంలో నిర్వహించిన మొదటి జిల్లా ఎగ్జిక్యూటివ్ యూత్ కాంగ్రెస్ మీటింగ్ కార్యక్రమంలో ముఖ్యఅతిదులుగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,కొప్పుల వేణారెడ్డి, పాలకూర్ల రవికాంత్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో యూత్ కాంగ్రెస్ విభాగం చాలా కీలకమని యూత్ కాంగ్రెస్ లో ఎవరైతే క్రియాశీలకంగా సమర్థవంతంగా చురుకుగా ఉంటారో వారికి రాజకీయంగా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జాతీయ రాజకీయాల్లో ఉన్న చాలామంది ప్రముఖులు యూత్ కాంగ్రెస్ లో పనిచేసిన వారేనని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పథకాలను చేస్తున్న అభివృద్ధిని సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేయాలని యువత మరియు నిరుద్యోగులకు ఎల్లవేళలా అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయాలని ఆయన యూత్ కాంగ్రెస్ నాయకులకు సూచనలు చేసినట్టు తెలిపారు.సమాజంలో మార్పు రావాలంటే ముందుగా యువత బలోపేతం కావాలి యువజన నాయకులు తాము ఉన్న గ్రామాల్లో ప్రజల సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి పోరాడాలి యువతే ఈ దేశ భవిష్యత్తు.. అందుకే మీరు నిరంతరం ప్రజలతో మమేకమై ఉండాలి అని సూచించారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం నిరంతర చైతన్యం అవసరం ప్రజల మధ్య పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లి, పేద ప్రజలకు మద్దతుగా నిలవాలి యువజన నాయకులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి.సోషల్ మీడియా వేదికగా పార్టీకి మద్దతు ప్రచారం చెయ్యాలన్నారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని భావిస్తోంది. పదేండ్ల తర్వాత అధికారంలోకి రావడంతో అధిష్టానం పార్టీకి గత వైభవం తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా మహిళ అధ్యక్షురాలు అసెంబ్లీ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని దళారులకు విక్రయించవద్దు

**ఆర్మూర్ ,విశాలభారతి:**



రైతులు ఆరుగాలం పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి రైతులకు సూచించారు. మాక్లూర్ మండలం చిక్లిగ్రామంలో గురువారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతుధర పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అశోక్, దయాకర్ రావు, సుదర్శన్, లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు రైతులు పాల్గొన్నారు.

# కేసీఆర్ రాష్ట్ర జీడీపీ పెంచితే, రేవంత్ రెడ్డి గుండాయిజాన్ని పెంచారు

- కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పేది ఒకటి చేసేది ఒకటి
- కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఆగం ఆగం....
- వన్యప్రాణులు రోధిస్తుంటే రేవంత్ రెడ్డికి చీమ కుట్టినట్లు కూడా లేదు
- మాజీ మంత్రి హరీష్ రావు





**ఆమనగల్లు,విశాలభారతి:**

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అంతా ఆగమైనదని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయక పోగా సంక్షేమ పథకాలను బంద్ పెడుతున్నారని రాష్ట్ర మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. గురువారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామపంచాయతీ పరిధి లోని బోయిన్ గుట్ట తండాలో ఆయన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిలతో కలిసి సేవాలాల్, అంబేద్కర్, గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సీఎం హోదాలో ఉండి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో, బయట అన్ని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. రోడ్లు, ఫార్మా పేరుతో పేదల భూములు లాక్కుంటే ఊరుకునేది లేదని వారికి బిఆర్ఎస్ అండగా ఉంటుందని చెప్పారు.పేదల పై చిత్తశుద్ధి ఉంటే ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలను మోసం చేసేందుకు బిల్లు పెట్టి కేంద్రాన్ని ఒప్పిస్తానని ఢిల్లీలో ధర్నా చేసిన రేవంత్ ధర్నాకు ఢిల్లీలో ఉండి రాహుల్ గాంధీ ముఖం చాటేసారని ఇక కేంద్రాన్ని ఏం ఒప్పిస్తాడని ఆయన ఎద్దేవా చేశారు. పింఛన్లు నెలకు 4000 ఇస్తానని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 16 నెలల్లో 4 వేలు ఇవ్వకపోగా రెండు నెలల పింఛను కోత పెట్టి నాలుగు వేలు ఎగ్గొట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా క్రమంగా బంద్ పెడుతున్నారని మహిళలకు రెండున్నర వేలు, కల్యాణ లక్ష్మి తులం బంగారం, ఇవ్వకపోగా బతుకమ్మ, కేసీఆర్ కిట్లు, రంజాన్ తోఫాలను బంద్ చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పేది ఒకటి చేసేది ఒకటిగా ఉందని ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని ఆయన కోరారు. సభలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని ప్రశాంతత కోసం ఆలయాలకు వెళ్తే వారిపై లైంగిక దాడులు జరుగుతున్నాయి అని ఆమె చెప్పారు. రాష్ట్రాల్లో మళ్లీ కరెంటు కష్టాలు ప్రారంభమయ్యాయని హామీల అమలులో ప్రభుత్వం విఫలమైనదని దుయ్యబట్టారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లో వన్యప్రాణులు రోధిస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు.రాష్ట్రం లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర జీడీపీ పెంచితే, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో గుండాయిజాన్ని పెంచుతున్నాడని, రాష్ట్రంలో రోజురోజుకు శాంతి భద్రతలు అదుపులో లేకుండా పోయాయని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, పిఎసిఎస్ చైర్మన్గంప వెంకటేష్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ చైర్మన్ సత్యం, నాయకులు పత్య నాయక్,రాఘవేందర్, నిరంజన్, శ్రీనివాస్, తులసిరామ్, గోపాల్, రమేష్, చంద్రమౌళి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.




## ప్రశంస పత్రం అందుకున్న భీమ్‌గల్ మున్సిపల్ కమీషనర్

**బాల్కొండ,విశాలభారతి:**

స్టేట్ లెవెల్ లో ఆస్తి పన్ను వసూళ్ల లో 77.63% వసూలు చేసినందుకు భీమ్‌గల్ మున్సిపల్ కమీషనర్ గోపు గంగాధర్ గురువారం ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కార్యాలయంలో స్టేట్ లెవెల్ మున్సిపల్ కమీషనర్ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో భీమ్‌గల్ మున్సిపాలిటీకి పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ సంచాలకులు శ్రీదేవి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకోవడం జరిగింది. ప్రశంస పత్రం రావడానికి కారణం అయిన మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి కమీషనర్ కృతజ్ఞతలు తెలిపారు.ప్రశంస పత్రం రావడం సంతోషంగా ఉందని,మున్సిపల్ అభివృద్ధికి మరింత బాధ్యతగా పని చేస్తామని ఈ సందర్భంగా కమీషనర్ తెలిపారు.



## శ్రీ సంతోషిమాత దేవాలయంలో శ్రీరామ భజన

**సూర్యాపేట,విశాలభారతి:**

శ్రీ సీతారామ నవరాత్రోత్సవాల సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో ఉగాది నుండి ప్రారంభమైన శ్రీరామ భజన శ్రీ లలితా సహస్రనామ పారాయణం గురువారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీరామ భజన, సామూహిక లలితా సహస్రనామ పారాయణాన్ని నిర్వహించారు. భక్తుల నుద్దేశించి శ్రీ సంతోషిమాత దేవాలయ ప్రధాన కార్యదర్శి బ్రాహ్మ0డ్లపల్లిమురళీధర్ మాట్లాడుతూ ఈనెల ఆరో తారీకు ఆదివారం శ్రీరామనవమి వరకు సామూహిక శ్రీరామ భజన, లలితా సహస్రనా పారాయణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ భజన కార్యక్రమంలో పాల్గొంటున్నారని అన్నారు. భగవంతుని నామ సంకీర్తన వల్ల మోక్ష ప్రాప్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషిమాత దేవాలయం ఉపాధ్యక్షులు పబ్బా ప్రకాశరావు,ఉప కోశాధికారి కొత్త మల్లికార్జున్,ఉత్సవ నిర్వాహకులు గోపారపు రాజు, విశ్వహిందూ పరిషత్ తోట లచ్చయ్య, అన్నదానం నిర్వహకులు దేవరశెట్టి సోమయ్య, కర్నాటి సూర్యకళ, బ్రాహ్మణపల్లి శోభ సభ్యులు చింత వెంకన్న, కమటాల వెంకటేశ్వర్లు, పాల్వాయి చలపతి రావు, బ్రహ్మాండ్లపల్లి నాగమణి, పబ్బా ప్రమీల, తాళ్లపల్లి సుగంధ మాల, దుస్సా పుష్ప,భాగ్యమ్మ,పున్నమ్మ, సుధారాణి,భారతమ్మ, మాధవి లత, శశాంక్, సిహెచ్ పద్మావతి, వి లక్ష్మి, గుర్రం పద్మ, మంగమ్మ, ఓరుగంటి జగదీశ్వరి, దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు..

# రూ.7లక్షల,50 వేల ఎల్ఓసి అందజేసిన ముత్యాల సునిల్

**బాల్కొండ,విశాలభారతి:**



కమ్మర్ పల్లి మండల కేంద్రానికి చెందిన చిన్నారి పి.అయాన్షికి వినికిడి లేమితో బాధపడుతూ హైదారాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ లో చేరారు.ఆపరేషన్ కొరకు ఎక్కువ మొత్తంలో డబ్బు ఖర్చు అవుతుండడంతో వారి కుటుంబం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ని సంప్రదించారు.వెంటనే ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.7లక్షల,50వేల ఎల్ఓసిని మంజూరు చేయించి, కుటుంబ సభ్యులకు అందజేశారు.ఆపద సమయంలో అండగా ఉన్న ముత్యాల సునీల్ కుమార్ కి వారి కుటుంబ ధన్యవాదాలు తెలిపారు.

# మహిళలు ఉచిత నైపుణ్యాభి వృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- గండూరి కృపాకర్

**సూర్యాపేట,విశాలభారతి:**



మహిళలు స్వయం ఉపాధి పొందుటకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్ తెలిపారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 45వ వార్డులో ఏర్పాటు చేసిన విలేకరల సమావేశంలో వారు మాట్లాడుతూ స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ, సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త సేవా ఆధ్వర్యంలో ఈ నెల 5 న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంజి రోడ్డులో గల మనీ డెంటల్ హాస్పిటల్ ప్రక్కన గల శ్రీ భగవాన్ ఆయుర్వేదిక్ బిల్డింగ్ లో మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోసి, ఆరీ వర్క్( మగ్గం) ఉదయం 9 గంటలకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నందున సూర్యాపేట పట్టణ, జిల్లా ప్రజలు, సద్వినియోగం చేసుకోవాలనీతెలిపారు. వివరములకు కళ్యాన్ సెల్: 9618062848, కుక్కడపుభిక్షం సెల్: 9032341944 ను సంప్రదించాలని తెలిపారు.

# భీమ్‌గల్ లో ఫ్లెక్సీ వివాదం

- 4గురి వ్యక్తులపై కేసు నమోదు

**బాల్కొండ,విశాలభారతి:**

భీమ్‌గల్ పట్టణంలో ఫ్లెక్సీ వివాదం నెలకొంది.ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు భాగ్య లక్ష్మి ఎంటర్ ప్రైజెస్ షాప్ ప్రక్కన రంజాన్ పండుగ సందర్బంగా శుభాకాంక్షల ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.పండుగ ముగిసి మూడు రోజులైన ఫ్లెక్సీ తొలిగించలేదు. బుధవారం రాత్రి 7:45 సమయంలో భాగ్య లక్ష్మి ఎంటర్ ప్రైజెస్ షాప్ ఓనర్ లక్ష్మి నారాయణ ఫ్లెక్సీని తిసివేశారు. ఫ్లెక్సీ తీసిన దానిని మనసులో పెట్టుకొని ఫ్లెక్సీలో ఉన్న కొంత మంది వ్యక్తులు లక్ష్మి నారాయణ పై దాడి చేశారని ఆయన ఇచ్చిన పిర్యాదు మేరకు ఫ్లెక్సీలో మొదటగా ఉన్న 4గురి వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.పట్టణంలో అనుమతులు లేని ఫ్లెక్సీలు పెట్టినట్లయితే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.దిని కోసం మున్సిపల్ డిపార్టుమెంటుతోని సమన్వయం చేసుకొని పని చేస్తామని తెలిపారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక



cinema updates



## మళ్లీ ‘పంచాయత్’ కష్టాలు

ఓటీటీ వేదికగా ఎన్నో భిన్నమైన వెబ్‌సిరీస్‌లు వచ్చినా.. అందులో మనసుకు హత్తుకునేలా నిలిచిపోయేవి కొన్నే ఉంటాయి. అందులో ఒకటే ఈ ‘పంచాయత్’ వెబ్‌సిరీస్. ఏమాత్రం అంచనాలు లేకుండా విడుదలై సినీప్రియుల్ని విశేషంగా ఆకట్టుకుందీ సిరీస్. ఇప్పటికే మూడు సీజన్లుగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సిరీస్‌లో ‘పంచాయత్ సీజన్ 4’ రాబోతుంది. దీనికి దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్నారు. జితేంద్ర కుమార్, నీనా గుప్తా, రఘువీర్ యాదవ్, ఫైజల్ మాలిక్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా “ఇప్పుడు మరోసారి ‘పంచాయత్” అనే వ్యాఖ్యతో ఈ సిరీస్ జులై 2న రాబోతున్నట్లు ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించింది. ఇంజినీరింగ్ పూర్తి చేసిన అభిషేక్ త్రిపాఠి అనే వ్యక్తి.. ఉద్యోగావకాశాలు లేక ఓ మారుమూల గ్రామంలో పంచాయతీ సెక్రటరీగా విధుల్లో చేరతాడు. దీంతో ఆయన జీవితం ఊహించని మలుపు తిరుగుతుంది. ఆ ఉద్యోగంలో ఇమడలేక.. రోజు రోజుకు కష్టాలు పెరుగుతుంటాయి. మరి ఈ క్రమంలో అభిషేక్‌కు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయనేది ఈ సిరీస్ కథాంశం.



## ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్ర..

“టిల్లుని మరిచిపోయేలా ఉంటుందని చెప్పలేను కానీ... జాక్ మాత్రం ఎప్పటికీ గుర్తుండిపోయే మరో మంచి పాత్ర” అన్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా... బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘జాక్ - కొంచెం క్రాక్’. వైష్ణవి చైతన్య కథానాయిక. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ‘డి.జె.టిల్లు’, ‘టిల్లు స్క్వేర్’ చిత్రాలతో టిల్లుగా ప్రేక్షకులపై తనదైన ముద్ర వేసిన సిద్ధు... ఇందులో ఓ రహస్య ఆపరేషన్ కోసం రంగంలోకి దిగిన జాక్ అనే యువకుడిగా సందడి చేశారు.ట్రైలర్ ఆవిష్కరణ అనంతరం సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ “ఇది చాలా పెద్ద కథ. దర్శకుడు చెప్పగానే నచ్చింది. ఆయన ఈసారి జానర్ మార్చి ఈ సినిమా చేశారు. టిల్లు పాత్రలు ఏ మీటర్‌లో ఉంటాయో, జాక్ అంతకుమించి ఉంటుంది. ఆ సినిమాలు పాత్ర ప్రధానంగా సాగితే... ఇందులో పాత్రతోపాటు, కథకీ ప్రాధాన్యం ఉంది. చాలా మలుపులు ఉంటాయి. స్క్రీన్‌ప్లే సినిమాని పరుగులు పెట్టిస్తుంది. కొన్ని ఎపిసోడ్స్ అంతర్జాతీయ స్థాయిలో ఉంటాయి” అన్నారు.దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ మాట్లాడుతూ “పాత్ర సిద్ధు ఫ్లేవర్‌లో కనిపించినా, లోపల నా స్టైల్ భావోద్వేగాలు, సందేశం ఉంటాయి. సిద్ధులాంటి నటుడితో పనిచేయడం ఏ దర్శకుడికైనా చాలా సులభం. తనని నమ్మితే చాలు... సన్నివేశం అద్భుతంగా వస్తుంది. రచన నుంచే తను ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యాడు. జాక్ పాత్ర, సంభాషణల విషయంలో సిద్ధుకి స్వేచ్ఛ ఇచ్చా. తను చాలా బాగా చేశాడు. ప్రతి ఒక్కరిలోనూ జాక్ ఉంటాడు. ఆ జాక్ ఎవరనేది ఎవరికి వాళ్లు తెలుసుకోవాలనేది ఈ సినిమా. వైష్ణవి కళ్లతోనే నటించారు. ఆమె గొప్ప స్థాయికి వెళతారు.



## రష్మికపై కొత్త విమర్శలు

షనల్ క్రష్ రష్మిక మందన్న బ్యాక్ టు బ్యాక్ యానిమల్, పుష్ప 2, ఛావా సినిమాలతో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాలను సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ఈ మూడు సినిమాలతో దాదాపుగా రూ.3300 కోట్ల వసూళ్లను తన ఖాతాలో వేసుకుంది. ఒక హీరోయిన్ ఈ స్థాయిలో వసూళ్లను సొంతం చేసుకున్న సినిమాలను కేవలం రెండేళ్ల గ్యాప్‌లో చేయడం అనేది రికార్డ్‌గా చెప్పకోవచ్చు. ఈ మూడు సినిమాల తర్వాత వచ్చిన సల్మాన్ ఖాన్ 'సికిందర్' సినిమాకు మిశ్రమ స్పందన దక్కింది. ఓపెనింగ్ కలెక్షన్స్ నిరాశ పరచినా లాంగ్ రన్‌లో రూ.100 కోట్ల నుంచి రూ.120 కోట్ల వరకు రాబట్టే అవకాశాలు ఉన్నాయి అనే టాక్ వినిపిస్తోంది. రష్మిక గత చిత్రాలతో పోల్చితే సికిందర్ నిరాశ మిగిల్చినట్లే.పాన్ ఇండియా రేంజ్ హీరోయిన్‌గా దూసుకు పోతున్న రష్మిక ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో నిలుస్తూ ఉంటుంది. ఆమె చేసే వ్యాఖ్యల కారణంగా వివాదంలో ఉంటే, కొన్నిసార్లు ఆమెకు తెలియకుండానే వివాదంలో చిక్కుకుంటుంది. ఇటీవల ఆమె సినిమాలు భారీ విజయాన్ని సొంతం చేసుకున్నప్పటికీ ఆమె ఎంపిక సరిగా లేదు అంటూ కొందరు విమర్శలు చేస్తున్నారు. ఆమె అభిమానులు గొప్పగా చెప్పకుంటున్న యానిమల్, పుష్ప 2, ఛావా సినిమాలో హీరోయిన్ పాత్ర గురించి ట్రోల్స్ వస్తున్నాయి. కొందరు సినీ విశ్లేషకులు రష్మిక ఆయా సినిమాల్లో చేసిన పాత్రల గురించి కాస్త ఘాటుగానే కామెంట్స్ చేస్తున్నారు. ఆ మూడు సినిమాల్లోనూ హీరోల పాత్రలను హైలైట్ చేయడం కోసం రష్మిక పాత్రను వినియోగించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.